WANTED
స్టాఫ్ రిపోర్టర్లు & విలేకర్లు కావలెను
చిత్తూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాలు ప్రధాన కేంద్రంగా వెలువడుతున్న
స్వర్ణసాగరం దినపత్రికలో
పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని మండల కేంద్రాలలో రిపోర్టర్లు
జిల్లా కేంద్రాలలో స్టాఫ్ & రిపోర్టర్లు కావలెను
ఆయా జిల్లాల్లోని రాజకీయాలు, ఇతర అంశాలపై లోతైన విశ్లేషణాలు రాయగల సామర్థ్యం ఉండాలి, అనుభవం, అర్హతను భట్టి ప్రాధాన్యత ఇవ్వబడును
సంప్రదించండి : 94403 52036, 9949329705

మా కలం - సామాన్యుడి బలం

# స్వర్ణసాగరం

www.swarnasagaram.in జాతీయ తెలుగు దినపత్రిక

ఆంధ్రప్రదేశ్ తెలంగాణ | సంపుటి : 6 | సంచిక : 238 | ఎడిటర్ : డా.దామా విజయ్‌కుమార్ | సోమవారం 25 ఆగస్టు 2025 | వెల : 2-00

## స్వర్ణముఖికి గర్భకోసం



- ఉచితం మాటును దోపిడి
- భారీ యంత్రాలతో ఇసుక తరలింపులు
- స్వర్ణముఖి నదిలో భారీ గోతులు
- దెబ్బతింటున్న ప్రధాన రహదారులు
- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- కళ్ళు మూసుకున్న పోలీస్ రెవెన్యూ మైనింగ్ అధికారులు
- కోట్లు గడిస్తున్న ఇసుక దోపిడీదారులు
- దోపిడీని ప్రశ్నించిన వారిపై బెదిరింపులు



## 'ఓట్ల చోరీ' తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ ఉంది

- విపక్ష ప్రభుత్వాలను 30 రోజుల్లో కూల్చడమే బీజేపీ లక్ష్యం
- అందుకు 130వ రాజ్యాంగ సవరణ బిల్లు
- కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపణలు
- ఈ బిల్లులు పౌరులు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ఈడీ, సీబీఐ లాంటి సంస్థలకు అవకాశం కల్పిస్తాయి
- ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్ నడపడం లాంటిది'

3

## ధృతరాష్ట్ర న్యాయం

- పేదల ఇళ్లు కూల్చివేత
- భూ బకాసురులుకు మినహాయింపు
- శ్రీకాళహస్తిలో ఇదీ దుస్థితి






## మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు

- రుణ దరఖాస్తులకు కనీస క్రెడిట్ స్కోర్‌ను ఆర్బీఐ సూచించలేదు
- కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి
- క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి.
- కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదు

2

## అంతరిక్షం నుంచి ఎంతో అందంగా భారత్



- హైదరాబాద్ సూర్యోదయాన్ని 16సార్లు చూశా
- యాక్సియం- 4 మిషన్ అనుభూతిని వివరించిన శుభాంశు శుక్లా
- "భారత వాయుసేనలో చేరిన కొత్తలో నేను సిగ్గరిని
- మాట్లాడాలన్నా సంకోచించే వాడిని. నా నిర్ణయాలపై నాకే సందేహాలు వస్తుండేవి

2

## సుధాకర్‌రెడ్డికి తుది వీడ్కోలు

- చంద్రబాబు, రేవంత్, వెంకయ్య సహా ప్రముఖుల నివాళి
- అధికార లాంఛనాలతో అంతిమ యాత్ర.. గాంధీ వైద్య కళాశాలకు భౌతిక కాయం అప్పగింత
- సుధాకర్‌రెడ్డి మృతి తీరని లోటు:సీఎం చంద్రబాబు



**అమరావతి, స్వర్ణసాగరం**

సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డికి ప్రభుత్వం అధికార లాంఛనాలతో తుది వీడ్కోలు పలికింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రి నుంచి ఉదయం 10 గంటలకు హిమాయత్‌నగర్‌లోని సీపీఐ రాష్ట్ర కార్యాలయం మఖ్దూం భవన్‌కు ఆయన భౌతిక కాయాన్ని తీసుకువచ్చారు. అక్కడ ప్రజలు, కార్యకర్తల సందర్శనార్థం ఉంచారు. రాజకీయాలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, ప్రజా సంఘాల నాయకులు, ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి నివాళులర్పించారు. మధ్యాహ్నం 3 గంటలకు సురవరం - మిగతా3లో




## ఓట్ల తారుమారుకు మోదీ యత్నం

- బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారు
- చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు.

## ఎరువులపై విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలి

2



- దారి మళ్లించినా.. ధరలు పెంచినా కేసులే
- యూరియా కోసం రైతులెక్కడా ఇబ్బంది పడకూడదు
- మార్క్‌ఫెడ్‌కు 70% కేటాయింపులు
- పీఏసీఎస్, ఆర్ఎస్‌కేల్లో సరిపడా నిల్వలుంచాలి: సీఎం చంద్రబాబు

**అమరావతి, స్వర్ణసాగరం**

ఎరువులు పక్కదారి పట్టకుండా చర్యలు తీసుకోవాలని.. విజిలెన్స్ దాడులు ముమ్మరం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నల్లబజారుకు ఎరువులు తరలించే వ్యాపారుల లైసెన్సులు రద్దు చేయాలి. ధరలు పెంచి అమ్మేవారిపైనా కేసులు నమోదుచేయాలి. యూరియా కోసం రైతులు ఇబ్బంది పడకూడదు. ఎక్కువగా ఎరువులు విక్రయించే రిటైల్ వ్యాపారుల్లో.. తరచూ కొనుగోలు చేసేవారు ఉన్నట్లు గుర్తిస్తే వారిపై విచారణ చేయండి. యూరియా, ఇతర ఎరువుల నిల్వలు తనిఖీ చేయాలి. వాటి లభ్యతపై రైతులకు పూర్తిస్థాయి సమాచారాన్ని అందుబాటులో ఉంచాలి' అని స్పష్టంచేశారు. ఎరువుల లభ్యత, సరఫరాపై ఆదివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాతో పాటు - మిగతా3లో

# స్వర్ణముఖికి గర్భకోశం

-మొదటిపేజీ తరువాయి

**శ్రీకాళహస్తి, స్వర్ణసాగరం ప్రతినిధి:**

కూటమి ప్రభుత్వ ఎన్నికల హామీలలో భాగంగా అమలుపరిచిన హామీలలో ఒకటి ఉచిత ఇసుక విధానం. రాష్ట్రస్థాయిలో అవినీతికి తావు లేకుండా ఈ విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశించారు. కానీ ముఖ్యమంత్రి తీసుకున్న ఈ నిర్ణయం క్షేత్రస్థాయిలో అందుకు భిన్నంగా అమలవుతోంది. కేవలం రాజకీయ పలుకుబడి ఉన్న కొందరు నదీ గర్భాలలో ఇసుకను కొల్లగొట్టి సొమ్ము చేసుకునేందుకు సిద్ధమయ్యారు. స్థానిక రాజకీయ నేతల సిఫార్సులతో ఆయా శాఖల అధికారులు కళ్ళకు గంతలు కట్టి యదేచ్చగా ఇసుక దోపిడీకి తెర తీసి స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాలకు గర్బకోసాని మిగులుస్తున్నారు. ఈతంతు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు, ఏర్పేడు మండలలో విస్తృతంగా కొనసాగుతోంది.

**అనధికార ఇసుక రీచ్‌గా ఇరుపాక్షపురం :**

అధికార బలంతో ఉచితం మాటున ఇసుక దోపిడకి తెర తీసిన ఇసుకాసురులు శ్రీకాళహస్తి నియోజకవర్గ పరిధిలోని తొట్టంబేడు మండలం ఇరుపాక్షపురం స్వర్ణముఖి నదిని అనధికార ఇసుక రీచ్‌గా మార్చేశారు. ప్రోక్ లైనర్, జెసిబి, వంటి భారీ యంత్రాలను ఉపయోగించి లారీ, టిప్పర్, ట్రాక్టర్లతో ఇసుకను చుట్టుపక్కల ప్రాంతాలతో పాటు, చెన్నై వంటి సుదూర ప్రాంతాలకు తరలిస్తున్నారు. గత కొంతకాలంగా జరుగుతున్న ఈ ఇసుక దోపిడీతో దోపిడీదారులు ఇప్పటివరకు కోట్ల రూపాయలు సొమ్ము చేసుకున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు.

**అక్రమ దోపిడీకి కాపుదారులు :**

ఈ అక్రమ ఇసుక దోపిడీని బయటకు పొక్కకుండా ఉండేందుకు దోపిడీదారులు కాపుదారులను కూడా ఏర్పాటు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఈ దోపిడీ విధానాన్ని అధికారులు, ప్రజల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించిన వారిపై వారు ఏర్పాటు చేసుకున్న కాపుదారులతో బెదిరింపులకు దిగిన సందర్భాలు కూడా చోటు చేసుకుంటున్నాయి.



**దెబ్బతింటున్న రోడ్లు అడుగంటుతున్న భూగర్భ జలాలు**

భారీ యంత్రాలతో ఇసుకను కొల్లగొడుతొండడంతో స్వర్ణముఖి నదీ గర్భంలో లోతైన గోతులు ఏర్పడుతున్నాయి. దీని కారణంగా నదీగర్భం నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోయి, భూగర్భ జలాలు అడుగంటే పరిస్థితి నెలకొంది. ఇలాగే కొనసాగితే స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతాల వ్యవసాయ భూములు సాగునీటికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా భారీ వాహనాలతో గ్రామాల మీదుగా ఇసుక తరలింపులు చేపడుతుండడంతో ప్రధాన రహదారులు దెబ్బతిని మరమ్మతులకు గురవుతున్నాయని దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించే పనులు కూడా చేపట్టడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల కళ్ళకు రాజకీయ గంతలు :**

అక్రమ ఇసుక దోపిడీని అరికట్టాల్సిన మైనింగ్, రెవిన్యూ, పోలీస్ శాఖల అధికారుల కళ్ళకు రాజకీయ గంతలు కట్టడంతో పగలు రాత్రి తేడా లేకుండా ఇసుక అక్రమంగా సరిహద్దులు దాటుతున్న పట్టించుకున్న పాపాన పోలేదు. ఈ తంతు ఎవరికి తెలియకుండా జరుగుతుందా అంటే క్షేత్రస్థాయిలో స్థానిక రెవిన్యూ తలారి నుంచి సచివాలయ ఉద్యోగుల దాకా అక్కడే తిష్ట వేసుకుని విధులు నిర్వహిస్తున్నప్పటికీ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వ లేదనడంలో వాస్తవం లేదని తెలుస్తోంది. అధికార యంత్రాంగానికి మొత్తం తెలిసినప్పటికీ యదేచ్ఛగా ఇసుక దోపిడీ కొనసాగటం విశేషం. ఇప్పటికైనా ఆయా శాఖల అధికారులు రాజకీయ గంతలువిప్పి, ఇసుక దోపిడీకి అడ్డుకట్ట వేసే ప్రయత్నాలు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

**దోపిడీని అరికడతాం : తొట్టంబేడు తాసిల్దార్**

తొట్టంబేడు మండలంలో ఎక్కడ అధికార ఇసుక రీచ్ ఏర్పాటు చేయలేదు. ఇసుక అక్రమ దోపిడీ జరుగుతున్నట్లు మాకు సమాచారం ఉంది. త్వరలో రెవిన్యూ మైనింగ్ పోలీస్ శాఖల సమన్వయంతో ఇసుక తరలిస్తున్న ప్రాంతాలను పరిశీలించి అక్రమ ఇసుక దోపిడి పై తగు చర్యలు చేపడతాం

# ధృతరాష్ట్ర న్యాయం

-మొదటిపేజీ తరువాయి

పాలకులు ఎపుడూ ప్రజల క్షేమం కోరాలి. ముఖ్యంగా అణగారిన వర్గాలకు అండగా నిలవాలి. కనీస వసతులైన కూడు, గూడు, నీడ పొందడం ప్రజల హక్కు.ఇది మనం మాత్రమే చెప్పేది కాదు.ఏలికలు ఎక్కడకు వెళ్లినా ఇదే చెబుతుంటారు. అయితే వారు చెప్పే మాటలకు...చేసే పనులకు పొంతన ఉండదు.శ్రీకాళహస్తిలో ఇదే జరుగుతోంది.తల దాచుకోవడం కోసం ఎంతో కష్టపడి... అప్పులు చేసి పేదలు నిర్మించుకున్న చిన్న పాటి ఇళ్లు, పునాదులు కలిపి 45వరకు నిర్మాణాలు నిర్ధాక్షిణ్యంగా ఆదివారం వేకువ జామున కూల్చి వేశారు. ఇందుకు సంబంధించి పేదలకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వలేదు. కూల్చివేతల సందర్భంగా పేదలు చేసిన ఆర్తనాదాలు అధికారులు పట్టించుకోలేదు. పేదలపై అధికార యంత్రాగం తమ ప్రతాపం చూపారు. భూ బకాసురుల చెరలో ఉన్న నిర్మాణాలు, స్థలాలకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. అందుకే ఏలికల తీరును ప్రజలు ధృతరాష్ట్ర న్యాయంగా విశ్లేషిస్తున్నారు. **శ్రీకాళహస్తి, స్వర్ణసాగరం ప్రతినిధి:**

వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఇందిరమ్మ పథకం కింద నిరుపేదలకు ఇళ్లు నిర్మించి ఇవ్వాలనే ఉన్నతాశయంలో శ్రీకాళహస్తి పట్టణ శివారులో 295 ఎకరాల భూమిని సేకరించారు. ఈ కాలనీకి రాజీవ్ నగర్‌గా నామకరణం చేశారు. ఇక్కడ సుమారు 7వేల మందికి ఇళ్ల పట్టాలు ఇచ్చారు. ఇక్కడ లబ్దిదారుల ఎంపిక విషయంలో అప్పటి అధికారులు, ప్రజా ప్రతినిధులు నిబంధనలు పాటించలేదు. తమకు అనుకూలంగా ఉన్న వారికి ఇంటి పట్టాలు ఇచ్చారు. ఈ అక్రమాలపై పత్రికల్లో వరుస కథనాలు రావడంతో ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించారు. ఈ విచారణకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఇలా అధికారులు మూడు పర్యాయాలు విచారణ జరిపి..2,500కు పైగా బోగస్ పట్టాలు ఉన్నట్లు తేల్చారు.వీటిలో కొన్ని రద్దు చేశారు. కొన్నింటిని అలాగే వదిలేసారు.అయితే ఇక్కడ పట్టాలు రద్దు చేసినట్లు ఏనాడూ అధికారిక ప్రకటన చేయలేదు. ఇదే రెవిన్యూ ఉద్యోగులకు వరంగా మారింది.

**'బంగారు బాతు'లా రాజీవ్ నగర్**

రాజీవ్ నగర్ ప్రజా ప్రతినిధులు, రెవిన్యూ ఉద్యోగులు, అంగ, అర్థ బలం ఉన్న వారికి బంగారు బాతులా మారింది. అధికారంలో ఎవరు ఉన్నా... అధికారులు ఎవరు వచ్చినా... రాజీవ్ నగర్ పైనే కళు పడతాయి. ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఈ స్థలాలకు నకిలీ పట్టాలు సృష్టించి వీరు వ్యాపారం చేస్తారు. గత ప్రభుత్వాలలో హయాంలో ఈ తరహా వ్యాపారం విపరీతంగా జరిగింది. కార్యకర్తలకు సుమారు వెయ్యి. పట్టాలు ఇవ్వడం ఇందుకు నిదర్శనంగా ప్రజలు ఆరోపిస్తుంటారు. మాజీ ప్రతినిధులు ముఖ్య అనుచరులుగా ఉన్న కొంతమంది ఇక్కడ ప్లాట్లు ఆక్రమించి.. వాటికి నకిలీ పట్టాలు తయారు చేసి విక్రయించి రూ.కోట్లుకు పడగలెత్తినట్లు గతంలో తీవ్ర చర్చనీ యాంశమైంది. ఈ కేసులో గత ఎమ్మెల్యే అనుచ రులలో ఒకరు జైలుకు కూడా వెళ్లారు. ఈ కేసు ఇంకా విచారణలో ఉంది. గత ప్రభుత్వంలో ఒక ప్రజాప్రతి నిధి వద్ద పీఏగా పని చేసిన ఓ ప్రభుత్వ ఉద్యోగి రాజీవ్ నగర్ అక్రమాల్లో కీలక పాత్ర పోషించారనే ఆరోపణ బలంగా ఉంది. నకిలీ పట్టాలు సృష్టించి... ప్రభుత్వ స్థలాలు విక్రయించడం ఈయన దినచర్యగా పెట్టుకున్నాడు. ఇదే సాకుతో కొంతమంది విద్యుత్ మీటర్ల పేరుతో ఒక్కొక్కరి నుంచి రూ.30వేలు నుంచి రూ..50వేలు వరకు వసూలు చేసేవారు. ఇలా పేదల రక్తం తాగి రూ.కోట్లుకు పడగెట్టారు. వాళ్లను ఎవరూ ఏమీ ఏమి చేయలేకపోయారు. వీళ్ళ తీరుతో అప్పటి అధికార పార్టీ, కీలక ప్రజాప్రతినిధికి చెడ్డపేరు చాలా ఎక్కువగా రావడంతో...ఓటమికి అదొక కారణం అయ్యింది చెబుతారు.





**అధికారులపై చర్యలు తీసుకోకుండా...**

రాజీవ్ నగర్‌లో పెద్ద ఎత్తున అక్రమాలు జరగడానికి ప్రధాన కారణం ఉద్యోగులు. అక్రమార్కులకు పట్టాలు ఇచ్చేది వారే.. విద్యుత్ సర్వీసులకు అనుమతి పత్రాలు రాత పూర్వకంగా ఇచ్చిందీ వారే. ఇందుకోసం పెద్ద మొత్తంలో వసూళ్లకు పాల్పడ్డారు. ఇంటి పట్టాకు రూ.లక్ష... విద్యుత్ సర్వీసుకు రూ.30వేలు నుంచి రూ.50వేలు వరకు వసూలు చేశారు. ఈ పట్టాలపైనా, విద్యుత్ సర్వీసు అనుమతి పత్రాల పైనా వీరి సంతకాలు ఇప్పటికీ సాక్ష్యంగా ఉన్నాయి. అయినా వారిపై ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు.

**దొంగే దొంగ అన్నట్లుగా...**

రాజీవ్ నగర్‌లో అక్రమ నిర్మాణాలు అంటూ పేదల ఇళ్లను అధికారులు కూల్చి వేయడం చూస్తుంటే దొంగే దొంగ అన్నట్లుగా ఉంది. అక్రమ నిర్మాణాల పేరుతో పేదల ఇళ్లు కూల్చడానికి వచ్చిన వారిలో కొందరు నకిలీ పట్టాల సృష్టి కర్తలు ఉండటం ఇందుకు నిదర్శనం. రెవిన్యూ అధికారులే పట్టాలు ఇచ్చి... వారే ఇపుడు వాటిని కూల్చడం దేనికి సంకేతమో అర్థం కావడం లేదు. అవి అక్రమం అయినపుడు అక్కడ ఎందుకు పట్టాలు ఇచ్చినట్లు..? నిర్మాణాలు చేసేటపుడు ఎందుకు అడ్డుకోలేదో...? ఇవన్నీ శ్రీకాళహస్తి వాసుల మదిలో మెదలుతున్న ప్రశ్నలు.

**వారికి మినహాయింపు ఎందుకో..?**

రాజీవ్ నగర్‌లో అక్రమ నిర్మాణాల పేరుతో పేదలకు చెందిన ఇళ్లు కూల్చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన పది రోజుల్లోనే సుమారు 50 ఇళ్ల వరకు కూల్చారు. ఇపుడు మళ్లీ 45 నిర్మాణాలు కూల్చారు. ఇంతవరకు బాగానే ఉంది. అయితే భూ బకాసురుల ఆక్రమించి నిర్మాణాలను మాత్రం అపుడూ... ఇపుడూ వదిలేశారు. వీరంతా గత ప్రభుత్వంలోని కార్యకర్తలు వారే కావడం గమనార్హం. వారివి అక్రమ నిర్మాణాలు అని తెలిసినా... ఎలాంటి చర్యలూ తీసుకోకుండా పని చేస్తున్న అంతర్గత శక్తి ఎవరు..? అనేది ప్రశ్నగా మిగిలిపోతోంది. అధికారులు ఇలా చేయడం దేనికి సంకేతమో అర్థం కావడం లేదు.

**అధికారులు...!ఇదేందయ్యా...?**

రాజీవ్ నగర్ కూల్చివేతల విషయంలో అధికారుల తీరుపై విమర్శలు ఎక్కువవుతున్నాయి.భూ బకాసరులను వదలి పేదల గూళ్లు కూల్చడం ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రాజీవ్ నగర్‌లో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన గత ప్రభుత్వంలోని కార్యకర్తలు నేతలపై చర్యలకు ఇంతవరకు ఉపక్రమించక పోవడంపై పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మాజీ ప్రతినిధి ఎన్నికల సమయంలో ఇక్కడ సుమారు వెయ్యి పట్టాల వరకు కార్యక్తరలకు పంచి పెట్టారు. తహసీల్దార్లు పరమేశ్వరస్వామి, పేరున పెద్ద ఎత్తున పట్టాలు మంజూరు చేశారు. ఈ పట్టాలపై ఎందుకు విచారణ చేయలేదు..? పట్టాలు ఇవ్వక పోతే పేదలు ఇక్కడ ఇళ్లు నిర్మించుకునే వారు కదా..? ఊరందూరు సమీపంలోని జగనన్న కాలనీ... ఇనగలూరు వద్ద ఫుట్‌వేర్ పరిశ్రమ నిర్మాణం కోసం జరిగిన భూ సేకరణలో జరిగిన అక్రమాలు గురించి ఎందుకు ప్రశ్నించడం లేదు..? ఇవన్నీ వదలి రాజీవ్ నగర్‌లో నిరుపేదల ఇళ్లు కూల్చడం వెనుక ఆంతర్యం ఏమి..? ఇవన్నీ సామాన్యుని మదిలో మెదలుతున్న ప్రశ్నలు.వీటికి అధికారులు ఏం సమాధానం చెబుతారో వేచి చూడాలి.

# దోపిడీలో స్మార్ట్ రి'కార్డు'


కొత్త రైస్ కార్డుల ఖర్చు రూ.8 కోట్లు

పేరుకే స్మార్ట్.. సాంకేతికత ఎక్కడ

నిత్యావసర సరుకులు అపేసి కొత్త కార్డులిస్తే సామాన్యులకు లాభమేంటి

కేవలం కమీషన్ల కోసమే కొత్త కార్డులు ఇస్తున్న ప్రభుత్వం

కొత్త కార్డుల పంపిణీని గొప్పగా ప్రచారం చేసుకుంటున్న కూటమి




**అమరావతి**

కూటమి ప్రభుత్వం సాంకేతికత పేరుతో నిత్యం ప్రజలను మోసం చేస్తోంది. టెక్నాలజీ సాయంతో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నామంటూ కోతలు కోస్తోంది. ఇందులో భాగంగానే ప్రజా పంపిణీ వ్యవస్థలో (పీడీఎస్) 'స్మార్ట్ కార్డుల పంపిణీ'ని ఘనకీర్తిగా ప్రచారం చేసుకుంటూ అభాసుపాలవుతోంది. వాస్తవానికి, ప్రభుత్వం కొత్తగా పంపిణీ చేసే కార్డులు పేరుకే స్మార్ట్.. అందులో ఎటువంటి సాంకేతికతను అనుసంధానించే చిప్ వ్యవస్థ లేదు. చిన్న సైజులో కార్డులను ముద్రించి దానికి సాంకేతిక పరిభాషలోని 'స్మార్ట్'ను జోడించి లబ్ధిదారులను మభ్యపెడుతోంది. దీని కోసం ఏకంగా రూ.8 కోట్ల వరకు ఖర్చు చేయడం గమనార్హం. సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల లబ్ధిదారులకు కొత్త కార్డుల పంపిణీ చేపట్టనుంది.

**అదనపు లబ్ధి శూన్యం!**

కేంద్ర ప్రభుత్వం పీడీఎస్‌ను సాంకేతిక వ్యవస్థతో అనుసంధానించింది. వన్ నేషన్.. వన్ రేషన్ నినాదాన్ని తీసుకొచ్చింది. అంటే, వేలిముద్ర వేసి దేశంలో ఎక్కడ నుంచైనా రేషన్ తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఆధార్ నంబర్ ద్వారా కూడా రేషన్ పొందొచ్చు. కేములం ప్రభుత్వంలోని ఋమాత్యులు, కొందరు అధికారులు కమీషన్ల కోసం ఇలాంటి కొత్త ఆలోచనలను సృష్టించి స్మార్ట్‌గా వెనకేసుకుంటున్నట్టు వినికిడి. పైగా పాత కార్డులో కుటుంబ సమేతంగా రేషన్ లబ్దిదారులు ఫొటోలు ఉండేవి. స్మార్ట్ కార్డులో ఇంటి యజమానురాలి పాస్‌పోర్టు సైజు ఫొటో తప్ప ఇతరులు కనిపించరు. కేవలం వారి పేర్లు మాత్రమే ఉంటాయి. అది కూడా మూడు పేర్ల వరకు బాగానే కనిపిస్తాయి. అంతకు మించి ఎక్కవ మంది లబ్దిదారులు ఒకే కార్డులో ఉంటే వారి పేర్లు కుచించుకుపోవడం, లేదా లేకుండా ఉండటమే ఈ స్మార్టు కార్డు ప్రత్యేకత. దీనికి ఒక క్యూఆర్ కోడ్‌ను పెట్టి మిగిలిన వారి పేర్లు అందులో జోడిస్తున్నట్టు సమాచారం. వాస్తవానికి, ఈ%–%పోస్ మెషిన్‌కు, బియ్యం తూకం వేసే ఎలక్ట్రిక్ కాటాకు అనుసంధానం ఉండాలి. లబ్ధిదారుడి వివరాల ప్రకారం ఎలక్ట్రిక్ కాటాలో సరైన తూకంలో బియ్యం వేస్తేనే ఈపోస్ మెషిన్ అంగీకరించి లావాదేవీని అనుమతిస్తుంది. ఇది కేంద్ర ప్రభుత్వం నిబంధన మేరకు ప్రవేశపెట్టిన ప్రక్రియ. కానీ, కూటమి పాలనలో కొందరు డీలర్లు ఈ%–%పోస్ మెషిన్లను చేతుల్లో పెట్టుకుని తిరుగుతూ ఇష్టారీతిలో పీడీఎస్ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తుంటే.. ప్రభుత్వం బయట గొప్పలు చెప్పుకుంటోంది.

**స్మార్ట్ కోతలు.. పంపిణీలోనూ కోతలే!**

రేషన్ సరుకుల పంపిణీలోనూ కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేసింది. ఒక్క బియ్యం మినహా మరే సరుకులూ ఇవ్వడం లేదు. కందిపప్పు, పామాయిల్, చింతపండు, గోధుమ పిండి తదితర సరుకులన్నీ ఎక్కడా ఇవ్వడం లేదు. ఎన్నికల సమయంలో మాత్రం 18 రకాల నిత్యావసరాలు ఇస్తామని ప్రగల్భాలు పలికారు. తీరా, అధికారంలోకి వచ్చాక.. గత ప్రభుత్వం ఇస్తున్న సరుకులన్నింటినీ ఆపేశారు. రూ.220 కోట్లకుపైగా కందిపప్పు బకాయిలు పేరుకుపోవడంతో కాంట్రాక్టర్లు సరఫరాకు కూడా ముందుకు రావట్లేదు.

# సుధాకర్‌రెడ్డికి తుది వీడ్కోలు



-మొదటిపేజీ తరువాయి

భౌతిక కాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సుధాకర్‌రెడ్డి భౌతిక కాయాన్ని గాంధీ వైద్య కళాశాలకు అప్పగించేందుకు అంతిమ యాత్ర మొదలైంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ వై జంక్షన్ వరకు పోలీసుల మార్చ్ సాగింది. అక్కడి నుంచి రెడ్ వాలంటీర్లు కవాతు చేశారు. నారాయణగూడ చౌరస్తా, చిక్కడపల్లి, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, ముషీరాబాద్ మీదుగా యాత్ర సాగింది. సాయంత్రం 4.45 గంటలకు సురవరం భౌతిక కాయాన్ని గాంధీ మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఈ సందర్భంగా విప్లవ జోహార్లు అంటూ కార్యకర్తలు పాటలు పాడుతూ సుధాకర్‌రెడ్డికి కడసారి వీడ్కోలు పలికారు.

**రేవంత్, చంద్రబాబు నివాళి..**

సీపీఐ దిగ్గజ నేత సురవరం సుధాకర్ రెడ్డి పేరును శాశ్వతంగా గుర్తుండేలా చేస్తామని, ఈ మేరకు క్యాబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజలకు ఆదర్శంగా నిలిచిన వారిని తమ ప్రభుత్వం గుర్తిస్తుందన్నారు. మఖ్దూం భవన్‌లో సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి రేవంత్ నివాళులు అర్పించారు. సురవరం మృతి సీపీఐకి, దేశానికి తీరని లోటని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. సుధాకర్‌రెడ్డి భౌతిక కాయానికి చంద్రబాబు అంజలి ఘటించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. సురవరంతో తనకు సుదీర్ఘ స్నేహం ఉందని చంద్రబాబు తెలిపారు. ఆయనకు అనేక ఉద్యమాలు నడిపిన అనుభవం ఉందని అన్నారు. మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు సురవరం భౌతిక కాయానికి నివాళులు అర్పించి, సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సురవరం మా తొలి ప్రొఫెసర్


గాంధీ కళాశాల ప్రిన్సిపాల్ ఇందిర

సుధాకర్ రెడ్డి భౌతిక కాయాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం స్ఫూర్తిదాయకం. ఆయన గాంధీ కళాశాల విద్యార్థులకు తొలి అనాటమీ ప్రొఫెసర్ అవుతారు. ఆయన శరీరం ద్వారా ఎంతో మంది విద్యార్థులు వైద్య శాస్త్రాన్ని నేర్చుకుంటారు. ఆయన కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు.

# భారత్ ఎకానమీకి 'పర్యాటకం' దన్ను

2024లో రూ.21.15 లక్షల కోట్ల ఆదాయం

దేశీయ పర్యాటక రంగం వేగంగా అభివృద్ధి చెందుతోంది. ముఖ్యంగా కోవిడ్ మహమ్మారి అనంతరం పర్యాటకం తిరిగి పూర్వ స్థాయిని మించి పుంజుకుంది. దేశీయ, అంతర్జాతీయ పర్యాటకం రెండూ బలంగా విస్తరిస్తున్నప్పటికీ, వసతి మౌలిక సదుపాయాలలో గణనీయమైన కొరత ఉందని నీతిఆయోగ్ తాజా నివేదికలో స్పష్టం చేసింది. కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం పీక్ సీజన్లలో దేశవ్యాప్తంగా రెండు లక్షలకు పైగా హెూటల్ గదుల కొరత ఉంటుందని నివేదిక పేర్కొంది. ఈ నేపథ్యంలో హెూమ్ స్టేలు కీలక ప్రత్యామ్నాయంగా మారుతున్నాయని, వాటి విస్తరణకు మరిన్ని మార్గాలను అనుసరించాల్సిన అవసరం ఉందని నివేదిక సూచించింది.



**ప్రత్యామ్నాయ వసతి రంగం పురోగతి**

పర్యాటక రంగం విస్తృతంగా పెరుగుతున్న తరుణంలో వసతి మౌలిక సదుపాయాల లోటును భర్తీ చేయడానికి ప్రత్యామ్నాయ వసతి కీలక పరిష్కారంగా నిలుస్తోంది. కొత్త హెూటళ్ల నిర్మాణానికి అధిక పెట్టుబడి, నియంత్రణ ఆమోదాలు, భూమి లభ్యత అవసరం. అయితే, హెూమ్ స్టేలు తక్కువ ఖర్చుతోనే చక్కటి వసతి సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయి. ప్రత్యేకించి మారుమూల ప్రాంతాలు, ద్వితీయ%-%తృతీయ శ్రేణి నగరాలకు ఇవి ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయి. పర్యావరణ స్పృహ, కమ్యూనిటీ ఆధారిత పర్యాటకంతో వీటిని అనుసంధానం చేయాలని నివేదిక సూచించింది. హెూమ్ స్టేల కోసం కేంద్రం, రాష్ట్రాలు ఒక నమూనా విధానం రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేసింది. నివేదిక సిఫారసు చేసిన అంశాల్లో.. కొత్త ఆపరేటర్లకు సాంకేతిక సహాయం, ప్రాజెక్టు నిర్వహణ నైపుణ్యం, ఉత్తమ పద్ధతులపై మార్గదర్శకం, ఆర్థిక, ఆర్థికేతర రాయితీలు, గ్రామీణ, మారుమూల ప్రాంతాలకు ప్రత్యేక మద్దతు, నీరు, విద్యుత్, ఆస్తి పన్నులలో నివాస రేట్ల రాయితీలు, హెూమ్ స్టే రిజిస్ట్రేషన్ కోసం సింగిల్ విండో క్లియరెన్స్ వ్యవస్థ ఏర్పాటు వంటివి ఉన్నాయి.

**నివేదికలోని కొన్ని ముఖ్యాంశాలు..**

' 2024లో ప్రయాణ%-%పర్యాటక రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు రూ.21.15 లక్షల కోట్లు అందించింది. ఇది 2019తో పోలిస్తే 21 శాతం పెరుగుదల.

' వచ్చే దశాబ్దంలో ఈ రంగం రూ.43.25 లక్షల కోట్లు ఆర్థిక వ్యవస్థకు అందజేస్తుంది. ఇది దేశ జీడీపీలో 7.6 శాతంగా ఉంటుంది.

' 2024లో దేశీయ పర్యాటకులు రూ.16 లక్షల కోట్లు ఖర్చు చేశారు. ఇది 2019తో పోలిస్తే దాదాపు 25 శాతం అధికం. 2034 నాటికి ఈ ఖర్చు రూ.28.70 లక్షల కోట్లు చేరనుంది.

' అంతర్జాతీయ పర్యాటకులు 2024లో రూ.2.85 లక్షల కోట్లు ఖర్చు చేయగా, 2034 నాటికి అది రూ.4.07 లక్షల కోట్లు దాటుతుందని అంచనా.

' ప్రస్తుతం పర్యాటక రంగంలో 4.32 కోట్ల మంది ఉపాధి పొందుతున్నారు. అంటే, ప్రతి 11 ఉద్యోగాలలో ఒకటి ఈ రంగానిదే. 2034 నాటికి ఈ రంగంలో ఉపాధి 6.3 కోట్లకు పెరుగుతుంది.

' పర్యాటకుల అభిరుచులు కూడా మారుతున్నాయి. సుదీర్ఘమైన, ప్రయోజనకరమైన ప్రయాణాలపై వారు ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు.

' 87 శాతం మంది పర్యాటకులు కొత్త గమ్యస్థానాల్లో పర్యటించి, ఆ అనుభూతులను పదిలపరచుకోడానికి దీర్ఘకాల పర్యటనలను కోరుకుంటున్నారు.

' వర్కేషన్స్ (విహార ప్రదేశంలో ఉంటూ పని చేయడం), డిజిటల్ నోమాడ్ (స్థిర నివాసం లేకుండా, ప్రపంచంలోని ఏ ప్రదేశం నుంచైనా ఆన్‌లైన్‌లో పని చేసేవాడు) సంస్కృతి పెరుగుతున్నందున దీర్ఘకాల వసతిపై డిమాండ్ పెరిగింది.

' హెూమ్ స్టేలు, ఆఫ్‌బీట్ అలాగే గ్రామీణ పర్యాటకం వేగంగా విస్తరిస్తున్నాయి. దేశీయ హెూమ్ స్టే మార్కెట్ 2024ులో రూ.4,722 కోట్ల ఆదాయాన్ని నమోదు చేసింది.

' ఈ మారుతున్న ధోరణులు పర్యావరణ హిత, వెల్‌నెస్ టూరిజం, గ్రామీణ హెూమ్ స్టేల వంటి ప్రత్యామ్నాయ పర్యాటక నమూనాలకు దారి తీస్తున్నాయి.

## మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస సిబిల్ స్కోర్ అక్కర్లేదు



న్యూఢిల్లీ

మొదటిసారి బ్యాంకు రుణం తీసుకునే వారికి కనీస సిబిల్ స్కోర్ అవసరం లేదని కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గత వారం లోక్‌సభలో కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌధరి మాట్లాడుతూ.. మొదటిసారి రుణం కోసం దరఖాస్తు చేసుకున్న వారికి క్రెడిట్ స్కోర్ తక్కువగా లేదా సున్నాగా ఉంటే రుణ దరఖాస్తులను బ్యాంకులు తిరస్కరించరాదన్నారు. ఈ సందర్భంగా ఆర్బీఐ ఇచ్చిన ఆదేశాలను ఆయన ప్రస్తావించారు. కేవలం క్రెడిట్ చరిత్ర లేదన్న కారణంతో మొదటిసారి రుణం తీసుకునే వారి రుణ దరఖాస్తును బ్యాంకులు తిరస్కరించరాదని ఆర్బీఐ సూచించినట్టు తెలిపారు. రుణ దరఖాస్తులకు ఆర్బీఐ కనీస క్రెడిట్ స్కోర్‌ను ఏమీ సూచించలేదన్నారు. మొదటిసారి రుణం తీసుకునే వారికి సిబిల్ స్కోర్ తప్పనిసరి కాకపోయినప్పటికీ దరఖాస్తుదారుల నేపథ్య తనిఖీని నిర్వహించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖ బ్యాంకులను కోరింది. వీటిలో క్రెడిట్ చరిత్ర, గత చెల్లింపుల చరిత్ర, చెల్లింపుల్లో జాప్యం, రుణాల సెటిల్‌మెంట్ వంటివి ఉంటాయి. కాగా క్రెడిట్ ఇన్ఫర్మేషన్ కంపెనీలు(సీఐసీ) ఒక వ్యక్తికి క్రెడిట్ రిపోర్టులను ఇవ్వడానికి రూ.100 వరకు చార్జీని వసూలు చేయవచ్చని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. అంతకు మించిన మొత్తం ఆమోదనీయం కాదన్నారు.

**సిబిల్ స్కోర్ అంటే?**

సిబిల్ అంటే.. క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (ఇండియా) లిమిటెడ్. సిబిల్ స్కోర్ అనేది క్రెడిట్ యోగ్యతను నిర్ణయించే మూడంకెల సంఖ్య. ఈ స్కోర్ 300 నుంచి 900 వరకు ఉంటుంది. వ్యక్తిగత, బంగారం, గృహ, ఇతర బ్యాంకు రుణాలను తీసుకోవడానికి ఒక వ్యక్తి అర్హతను నిర్ణయించడానికి గాను సిబిల్ ఇచ్చే స్కోర్‌ను బ్యాంకులు వినియోగిస్తుంటాయి. స్కోరు 750అంతకంటే మెరుగ్గా ఉంటే పలు రుణాల ఆమోదానికి అర్హత ఎక్కువగా ఉంటుంది.

# 'ఓట్ల చోరీ' తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ ఉంది

ఓట్ల చోరీ తరువాత అధికారాన్ని చోరీ చేసే పనిలో బీజేపీ నిమగ్నమైందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. విపక్షాల ప్రభుత్వాలను 30 రోజుల్లో కూల్చి వేసేందుకే కేంద్రం 130వ రాజ్యాంగ సవరణ బిల్లును తీసుకొచ్చిందని అన్నారు. అరెస్టులను ఆయుధంగా ఉపయోగించి ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచడమే లక్ష్యంగా బీజేపీ ఈ బిల్లు తీసుకువచ్చిందని ఆయన పేర్కొన్నారు. ఏదైనా కేసులో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్టు అయ్యి వరుసగా 30 రోజులపాటు జైలులో ఉంటే, వారు పదవి కోల్పోయేలా కేంద్ర ప్రభుత్వం ఇటీవల లోక్‌సభలో మూడు బిల్లులు ప్రవేశపెట్టింది. వాటిని ఉద్దేశించి ఖర్గే మాట్లాడుతూ, 'ఈ బిల్లులు పౌరులు ఎన్నుకున్న ప్రభుత్వాన్ని కూల్చివేయడానికి ఈడీ, సీబీఐ లాంటి సంస్థలకు అవకాశం కల్పిస్తాయి. ఇది ప్రజాస్వామ్యంపై బుల్డోజర్ నడపడం లాంటిది' అని పేర్కొన్నారు.

హరియాణా, మధ్యప్రదేశ్‌లో నూతనంగా నియమితులైన డీసీసీ అధ్యక్షులకు దిల్లీలోని ఇందిరా భవన్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఖర్గే బీజేపీపై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఓటు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్?ఐఆర్?) ద్వారా ఓట్లను తొలగించే ప్రక్రియను బీజేపీ మున్ముందు కొనసాగిస్తుందని, వాటి పట్ల జిల్లా అధ్యక్షులు అప్రమత్తంగా ఉండాలని ఖర్గే సూచించారు. రాహుల్ గాంధీ చేపడుతున్న 'ఓటు అధికార్ యాత్ర' నుంచి ప్రజలను పక్కదోవ పట్టించేందుకు ప్రధాని మోదీ చొరబాటుదారుల అంశాన్ని లేవనెత్తారని మండిపడ్డారు. అవినీతి గురించి మాట్లాడుతున్న ప్రధాని అక్రమాలు చేసిన వారందరినీ పార్టీలో చేర్చుకొని మంత్రులు చేశారని ఖర్గే ఆరోపించారు.



**'కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలి'**

ఈ సందర్భంగా, సంస్థాగతంగా కాంగ్రెస్?ను బలోపేతం చేయాలని ఖర్గే డీసీసీ అధ్యక్షులకు సూచించారు. బూత్?, మండల్ కమిటీలను ఏర్పాటు చేయడంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఈ ప్యానెల్?లోని వ్యక్తులు పార్టీకి విధేయులుగా ఉండేలా, కాంగ్రెస్ సిద్ధాంతం నుంచి చలించకుండా చూసుకోవాలని ఖర్గే సూచించారు. ఎవరు ప్రలోభపెట్టినా, కాంగ్రెస్?కు విధేయులుగా ఉండే వ్యక్తులు పార్టీకి అవసరం అని నొక్కి చెప్పారు. అంతేకాదు, 'జిల్లా అధ్యక్షులకు ప్రాధాన్యం ఇవ్వకుండా పార్టీని తిరిగి అధికారంలోకి తేలేమని నేను, రాహుల్ గాంధీ గ్రహించాము. అందుకే డీసీసీలకు ప్రాధాన్యం కల్పిస్తున్నాం' అని ఖర్గే తెలిపారు.

**'ఓట్ల చోరీని 6నెలల తర్వాత గుర్తించాం'**

"కర్ణాటకలోని మహాదేవపురలో ఓట్ల చోరీ గురించి మాకు ఆరు నెలల పరిశోధన తర్వాత తెలిసింది. దీని గురించే రాహుల్ గాంధీ వివరణాత్మకంగా ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇప్పుడు బిహార్?లో బీజేపీ, ఈసీ కలిసి ఎస్?ఐఆర్ అనే కొత్త ఎత్తుగడను వేశాయి. అయితే దీనికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్లమెంట్?లో ఈ అంశంపై చర్చించాలని మేము కోరాం. కానీ ఓటు చోరీ చర్చ జరగకుండా బీజేపీ జాగ్రత్తపడింది. ఇకపై ఎస్?ఐఆర్ వంటి స్కీమ్?లతో బీజేపీ మన ప్రజల ఓట్లను తొలగించే ప్రయత్నం చేస్తూనే ఉంటుంది. కనుక కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు దీనిపై చాలా అప్రమత్తంగా ఉండాలి. బీజేపీ వ్యక్తులు, బీఎల్?ఓలు మన ప్రజల పేర్లను ఓటరు జాబితా నుంచి తొలగిస్తే, వెంటనే వారిని పట్టుకోవాలి. ఈ దేశంలో ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కాంగ్రెస్ ఇచ్చిన గిఫ్ట్ అని చెప్పాలి. ఎందుకంటే రాజీవ్ గాంధీ ఓటు హక్కు వయస్సును 21 ఏళ్ల నుంచి 18 ఏళ్లకు తగ్గించారు. దీని ద్వారా ప్రజాస్వామ్యంలో యువత పాల్గొనేలా చేశారు" అని మల్లికార్జున ఖర్గే చెప్పారు.

**'ప్రతిపక్ష నేతలను తొలగించే కుట్ర'**

"మన దేశంలో ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐలు 193 కేసులు పెట్టాయి. కానీ వాటిలో కేవలం రెండు కేసుల్లో మాత్రమే నిందితులు దోషులుగా తేలారు. సీబీఐ చాలా మంది ముఖ్యంత్రులు, మంత్రులను అరెస్ట్ చేసి నెలల తరబడి జైలులో ఉంచింది. కానీ ఇప్పుడు తన వద్ద ఎలాంటి ఆధారాలు లేవని చెబుతోంది. ఒక వేళ కేంద్రం తెచ్చిన బిల్లులు పార్లమెంట్?లో పాస్? అయితే, విపక్ష నేతలను అరెస్టులు అనే ఆయుధంతో బీజేపీ తొలగించే ప్రయత్నం చేస్తుంది" అని ఖర్గే ఆరోపించారు. కేంద్రం తెచ్చిన బిల్లుల ప్రకారం, కనీసం ఐదు సంవత్సరాల జైలు శిక్ష విధించదగిన నేరాలపై ప్రధానమంత్రి, కేంద్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, మంత్రులు అరెస్ట్ అయితే, వారు వరుసగా 30 రోజులు కస్టడీలో ఉంటే, వారు 31వ రోజున తమ పదవులు కోల్పోతారు.

## ఓట్ల తారుమారుకు మోదీ యత్నం



అరారియా

ఓటర్ల జాబితాలను తారుమారు చేసేందుకు ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ ఆరోపించారు. బిహార్లో జాబితాల ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్) ద్వారా పేదల ఓట్లు దొంగిలించాలని ఆయన అనుకుంటున్నారని విమర్శించారు. చిన్న పిల్లలు సైతం 'ఓట్ల దొంగా.. గద్దె దిగు' అంటున్నారని.. ఈసీ వారితో మాట్లాడాలని సూచించారు. ఆయన చేపట్టిన 'ఓటర్ అధికార యాత్ర' ఆదివారం అరారియా చేరుకుంది. ఓటర్ అధికార యాత్ర సందర్భంగా రాహుల్, తేజస్వి బుల్లెట్‌పై కాసేపు ప్రయాణించారు. ఈ సందర్భంగా ఓ వ్యక్తి భద్రతావలయాన్ని ఛేదించుకుని వచ్చి రాహుల్ ఎడమ భుజంపై ముద్దుపెట్టాడు. వెంటనే భద్రతాసిబ్బంది అతడిని కొట్టి సెక్యూరిటీ జోన్‌కు దూరంగా తీసుకెళ్లి వదిలిపెట్టారు. ఇదిలా ఉండగా, బిహార్లో ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా చేపట్టిన ఓటర్ల డాక్యుమెంట్ల తనిఖీ ముమ్మరంగా సాగుతోందని ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఇప్పటివరకు 98.2 శాతం మంది డాక్యుమెంట్లు సమర్పించారని తెలిపింది. ధ్రువపత్రాలకు ఇంకా 8రోజుల సమయం మాత్రమే ఉందని పేర్కొంది.

# అంతరిక్షం నుంచి ఎంతో అందంగా భారత్

అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్) నుంచి భారత్ చాలా అందంగా కనిపించిందని భారతీయ వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు. ప్రపంచంలోని ప్రత్యేక స్థానంలో, విశిష్ట ఆకారంలో ఉన్నందు వల్లే మన దేశం అలా కనిపించి ఉండొచ్చన్నారు. తాను భారతీయుడిని అయినందున ఈ మాట చెప్పడం లేదని, ఐఎస్ఎస్‌లోని ఏ వ్యోమగామిని అడిగినా ఈ విషయాన్నే చెబుతారని ఆయన పేర్కొన్నారు. ప్రత్యేకించి రాత్రి టైంలో హిందూ మహాసముద్ర మార్గంలో దక్షిణ దిశ నుంచి ఉత్తర దిశకు ఐఎస్ఎస్ వెళ్లేటప్పుడు, భారత్ చాలా అద్భుతంగా కనిపిస్తుందన్నారు. గగన్‌యాన్ మిషన్ కోసం ఎంపికైన నలుగురు గగన్ యాత్రీలను సత్కరించేందుకు భారత వాయుసేన ఆదివారం న్యూదిల్లీలోని సుబ్రతో పార్క్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఈసందర్భంగా నలుగురు గగన్ యాత్రీలు శుభాంశు శుక్లా (గ్రూప్ కెప్టెన్), పీవీ నాయర్ (గ్రూప్ కెప్టెన్), అజిత్ క్రిష్ణన్ (గ్రూప్ కెప్టెన్), అంగద్ ప్రతాప్ (గ్రూప్ కెప్టెన్)లను రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ సన్మానించారు. ఈ సందర్భంగా శుభాంశు శుక్లా మాట్లాడుతూ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో తాను చవిచూసిన అనుభూతి గురించి వివరించారు. అక్కడి నుంచి తాను రికార్డ్ చేసిన భారతదేశం వీడియోను చూపిస్తూ, భూమి ఎగువ వాతావరణంలో ఆక్సిజన్ ఆకుపచ్చ కాంతి, నక్షత్రమయ ఆకాశం ఉన్నాయన్నారు. హైదరాబాద్, బెంగళూరు నగరాలను శుభాంశు శుక్లా ప్రస్తావిస్తూ, ఈ రెండు నగరాల్లో సూర్యోదయం కావడాన్ని ఐఎస్ఎస్‌లోని వ్యోమగాములు రోజూ స్పష్టంగా చూడగలుగుతారని చెప్పారు. ఈ గొప్ప సీన్‌ను వ్యోమగాములు ఒక రోజులో ఏకంగా 16 సార్లు చూడగలుగుతారని, అయినా ఏ ఒక్కసారి కూడా బోర్ కొట్టదన్నారు. కొన్ని నెలల క్రితమే అమెరికాకు చెందిన యాక్సియం- 4 మిషన్ ద్వారా శుభాంశు శుక్లా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రాని(ఐఎస్ఎస్)కు వెళ్లొచ్చారు. అక్కడ ఎదురైన అనుభూతిని తెలిపే క్రమంలో ఆయన ఈవివరాలను వెల్లడించారు.



**నేను సిగ్గరిని, సంకోచించే వాడిని!**

"భారత వాయుసేనలో చేరిన కొత్తలో నేను సిగ్గరిని. మాట్లాడాలన్నా సంకోచించే వాడిని. నా నిర్ణయాలపై నాకే సందేహాలు వస్తుండేవి. అంతరిక్ష ప్రయాణం చేసే అవకాశం లభిస్తుందని అస్సలు అనుకోలేదు. దాని గురించి ఎన్నడూ కలలు కూడా కనలేదు. రాకేశ్ శర్మ అంతరిక్ష యాత్ర గురించి చిన్నప్పుడు కథలు మాత్రం వినేవాడిని. అటువంటి నన్ను భారత వాయుసేన ఈ స్థాయికి తీసుకొచ్చింది. నాలో ఈ గొప్ప మార్పుకు వాయుసేనే కారణం. విమానంలోని కాక్‌పిట్ నా గొప్ప గురువు. ఈ యూనిఫామ్‌కు నేను రుణపడి ఉంటాను. భారత వాయుసేనకు నా ధన్యవాదాలు. ఇక్కడ కూర్చున్న వాళ్లంతా తమతమ స్థాయుల్లో చక్కగా విధులను నిర్వర్తించి ఉంటారు. నేనూ అలాగే ఫీలవుతాను. ఏ బాధ్యతను అప్పగించినా చక్కగా నిర్వర్తిస్తాను. ఎయిర్‌ఫోర్స్‌లో చేరే ప్రతీ ఒక్కరికి ఇదే విధమైన బాధ్యతాయుత ప్రవర్తన అలవడుతుంది" అని వ్యోమగామి శుభాంశు శుక్లా చెప్పారు.

**దేవుడికి, పైలట్‌కు మధ్యనున్న తేడా ఏమిటో తెలుసా?!**

"నేను యాక్సియం- 4 మిషన్ ద్వారా అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి వెళ్లాను. మా మిషన్‌కు కమాండర్‌గా పెగ్గీ విట్సన్ ఉన్నారు. అంతరిక్షంలో ఏకంగా 695 రోజుల పాటు గడిపిన రికార్డు ఆమెకు ఉంది. నేను ఒకసారి ఆమెతో సరదాగా మాట్లాడుతూ, దేవుడికి, పైలట్‌కు మధ్యనున్న తేడా ఏమిటో తెలుసా? అని అడిగాను. ఆమె తెలియదు అని చెప్పింది. తాను పైలట్ అని దేవుడు అనుకోడు అని ఆమెకు ఆన్సర్ ఇచ్చాను" అని శుభాంశు శుక్లా వివరించారు.

**గగన్ యాత్రీలను చూసి భారత్ గర్విస్తోంది : రాజ్‌నాథ్**

గగన్ యాన్ మిషన్‌కు వెళ్లనున్న నలుగురు గగన్ యాత్రీలు భారతదేశానికే గర్వకారణమని రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ కొనియాడారు. ఇందుకోసం వారు చాలా కఠినమైన శిక్షణను పొందారని చెప్పారు. అంతరిక్ష అన్వేషణలో భారత్ పెట్టుకున్న లక్ష్యాల సాకారంలో ఈ గగన్ యాత్రీలు కీలక పాత్ర పోషించబోతున్నారని ఆయన తెలిపారు. గగన్ యాత్రీల టీమ్‌లోని శుభాంశు శుక్లా, పీవీ నాయర్, అజిత్ క్రిష్ణన్, అంగద్ ప్రతాప్ భారతమాత ముద్దుబిడ్డలని, వారిని చూసి గర్విస్తున్నామని రాజ్‌నాథ్ చెప్పారు. యాక్సియం-4 మిషన్‌ను ముగించుకొని ఆగస్టు 17న భారత్‌కు తిరిగొచ్చిన శుభాంశు శుక్లాకు యావత్ భారతదేశం ఘన స్వాగతం పలికిందన్నారు. భారత్ చేపట్టబోయే గగన్ యాన్ మిషన్ అనేది ఆత్మనిర్భర్ భారత్ ప్రస్థానంలో కొత్త అధ్యాయం లాంటిదని ఆయన పేర్కొన్నారు. దీని ద్వారా ప్రపంచంలోని ప్రధాన అంతరిక్ష శక్తుల సరసన నిలిచేందుకు భారత్ గొప్ప క్రతువు చేయబోతోందని చెప్పారు. ఈ మిషన్ కోసం రత్నాల్లాంటి నలుగురు భారతీయ వ్యోమగాములు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. 40 ఏళ్ల క్రితం భారతీయ వ్యోమగామి రాకేశ్ శర్మ అంతరిక్షంలోకి అడుగుపెట్టారని, మళ్లీ ఇప్పుడు శుభాంశు శుక్లా ఆ ఘనతను సొంతం చేసుకున్నారని కొనియాడారు.

# మహా భారత యజ్ఞాన్ని తిలకించిన పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్

## ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదానం కార్యక్రమం





స్వర్ణసాగరం తవణంపల్లె ఆగస్ట్-24

పూతలపట్టు నియోజకవర్గం, తవణంపల్లి మండలం, గాజులపల్లె గ్రామంలో మహాభారత యజ్ఞం ఘనంగా జరిగింది. ఆదివారం మహాభారత యజ్ఞం కార్యక్రమానికి పూతలపట్టు శాసనసభ్యులు మురళీమోహన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు. భారతయజ్ఞంలో రాజసుయాగం హరికథ ఘట్టాన్ని ఆయన ఆలకించారు. అనంతరం ఎమ్మెల్యే చేతుల మీదుగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించి సుమారు 1000 మందికి పైగా భోజనాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మహాభారతం అనేది మన భారతీయ సంస్కృతికి మూలాధారం అని ఆయన పేర్కొన్నారు. రాజసుయాగం వంటి ఘట్టాలు మనకు నీతి, ధర్మం, నాయకత్వం గురించి బోధిస్తాయని తెలిపారు. గాజులపల్లిలో జరుగుతున్న ఈ మహాభారత యజ్ఞం గ్రామానికి ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది. ఇలాంటి యజ్ఞాలు సమాజంలో సద్భావన, శాంతి, ఐకమత్యం పెంపొందిస్తాయని తెలియజేశారు. ఈ మహా భారత యజ్ఞంలో పాల్గొనడం నా అదృష్టంగా భావిస్తున్నానని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తవణంపల్లె మండల అధ్యక్షులు వెంకటేష్ చౌదరి, పార్టీ నాయకులు ప్రవీణ్ నాయుడు ,మోహన్ నాయుడు, బంగారుపాలెం మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర నాయుడు, గోపి యాదవ్, రంజిత్ రెడ్డి, మహాభారత యజ్ఞం కమిటీ సభ్యులు లోకనాథ్ నాయుడు, మురళి,వేణు పలువురు మండల టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## గాంధీజీ ఆశ్రమంలో సర్వమత ప్రార్థనలు



ఇందుకూరుపేట స్వర్ణ సాగరం ఆగస్టు 24

మండలంలోని పల్లిపాడు పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమలో ఆదివారంసర్వమత ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో ముందుగా ఆశ్రమ కమిటీ సభ్యులు గంపల.మంజుల మహాత్మా గాంధీ విగ్రహానికి ఖాదీ వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు, ఆశ్రమ స్థల దాత పోనక.కనకమ్మ విగ్రహానికి పట్టు వస్త్రము మరియు నూలుమాల సమర్పించారు. అనంతరం స్కూల్ విద్యార్థులకు మహాత్మా గాంధీ యొక్క జీవిత విశేషాల గురించి వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఆశ్రమ మేనేజర్ మనోజ్ స్కూల్ విద్యార్థులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు

## నేతగానివాడలో అమ్మవారికి విశేష పూజలు





వాకాడు, స్వర్ణసాగరం:

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలో నేతగాని హరిజనవాడ గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ పోలేరమ్మ తల్లికి గ్రామస్తులు 58 కళశాలతో విశేష అభిషేకాలు నిర్వహించి, అమ్మవారికి హెూమములు జరిపించారు.ఈ సందర్భంగా గ్రామస్తులందరూ కలిసి గ్రామ పొంగళ్ళు పెట్టుకొని, మొక్కుబడులు తీర్చుకున్నారు. తిరుపతి జిల్లా అర్చక సలహా మండలి సభ్యులు దీవి అనంతాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి నామస్మరణతో ఆలయ పరిసర ప్రాంతాలు మార్మోగింది.గ్రామ పెద్దల పర్యవేక్షణలో యువత విశేషంగా పాల్గొని విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు,పసుపు,కుంకుమ పంచిపెట్టారు.

## తెలుగు భాష ను రాష్ట్ర భాషను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలి



### మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం

నెల్లూరు స్వర్ణ సాగరం ఆగస్టు 24

తెలుగు భాషను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించాలని మాజీ శాసన మండలి సభ్యులు విఠపు బాల సుబ్రహ్మణ్యం అన్నారు. తెలుగు భాష దినోత్సవ సందర్భంగా ఆదివారం నెల్లూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో జరిగిన అమ్మ భాషకు వందనం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక పుస్తకాలు తెలుగులో రావాలన్నారు. ఆత్మీయ అతిథిగా పాల్గొన్న అధ్యాపకురాలు కె.కరుణశ్రీ కళాశాలల్లో తెలుగు భాషకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.కార్యక్రమానికి ఇనమన మెల్లోరి నాగరాజా రావు అధ్యక్షత వహించగా నె రసం ప్రధాన కార్యదర్శి డా పాతూరి అన్నపూర్ణ సభా. నిర్వహణ చేశారు. తూమాటి సంజీవ రావు రచించిన విశిష్ట తెలుగు దర్శనం గ్రంథావిష్కరణ జరిగింది..అనంతరం పాఠశాల విద్యార్థులు తెలుగు భాషపై నృత్యాలు,పాటలు ప్రదర్శించారు.. ముప్పైమంది కవులు కవితలు చదివారు..

## గొలగమూడివెంకయ్య స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించిన సోమిరెడ్డి దంపతులు





వెంకటాచలం స్వర్ణ సాగరం ఆగస్టు 24

మండలంలోని గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామి ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సర్వేపల్లి శాసనసభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి జ్యోతమ్మ దంపతులు గొలగమూడి శ్రీ వెంకయ్య స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు దంపతులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా సోమిరెడ్డికి భక్తుల నుంచి ఘనస్వాగతం లభించింది. మహిళలు చిన్నారులు ఆయనతో కరచాలనం చేయడానికి ఉత్సాహం చూపారు

ఈ సందర్భంగా మాట్లాడుతూ వెంకయ్య స్వామి ఆశీస్సులతో సర్వేపల్లి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు తనకు స్వామి ఆశీస్సులు పుష్కలంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో స్థానిక నేతలు ఆయా శాఖల అధికారులు భక్తులు పాల్గొన్నార

తిరుపతి
చిత్తూరు నెల్లూరు అనంతపురం
విలేకరులు కావలెను
సంప్రదించండి : 9440352036

## గణనాధుని సేవలో ప్రముఖులు





కాణిపాకం, ఆగస్టు 24 స్వర్ణ సాగరం

గణనాధుని సేవలో ప్రముఖులు. కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామివారిని దర్శించుకున్న కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సీ.ఎం. జోషి , కుటుంబ సమేతంగా స్వామివారిని మరియు కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హె.పి. సందేశ్ , వీరు వేరువేరుగా స్వామివారిని దర్శించుకున్నారు, వీరికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేసిన ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, ఈ కార్యక్రమంలో సూపర్డెంట్ కోదండపాణి, ఎస్పై నరసింహులు, టెంపుల్ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు, చిత్తూరు కోర్టు సిబ్బంది ఉన్నారు.

## మోతుకూరి సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో రైతులకు అన్నదాన కార్యక్రమం





ఐరాల, ఆగస్టు 24 స్వర్ణసాగరం

మోతుకూరి సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో రైతులకు అన్నదాన కార్యక్రమం.ఐరాల మండలం పొలకల సంత గేట్ నందు రైతులు,ప్రజల కోసం ఆదివారం సంత రోజు ఐరాల మండల తెలుగుదేశం పార్టీ కార్య నిర్వాహక కార్యదర్శి మోతుకూరి సోమశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో,ప్రముఖ పారిశ్రామిక వేత్త సన్నపనేని వెంకటేష్ నాయుడు,యువ నాయకుడు భగవాన్ చౌదరి పర్యవేక్షణలో నిర్విరామంగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమం 19వ వారం కి చేరుకుంది.ఈ అన్నదాన కార్యక్రమం కి నిరంతరం సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేసు న్నాము. సీనియర్ నాయకులు గుర్రప్ప నాయుడు, రాంబాబు నాయుడు,దయానంద నాయుడు,కోవూరి రాజశేఖర్ నాయుడు, బొబ్బా సోమశేఖర్ నాయుడు, రాజేష్ నాయుడు,చిట్టి నాయుడు,గోపి నాయుడు,జై చౌదరి జాలరి,జగదీష్ చౌదరి, కూసి శశి కుమార్,చరణ్, పనీష్ చౌదరి,మరియు భీమినేని వారి పల్లె యువత పాల్గొన్నారు.

## నేటి నుండి కొత్త రేషన్ కార్డులు పంపిణీ

పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 24.

మండలంలోని 24 పంచాయతీలకు గాను మొత్తం 34 చౌక దుకాణాల పరిధిలో 10,687 కొత్త రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు సివిల్ సప్లై ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సన్నద్ధమైనట్లు ఆదివారం స్థానిక డిప్యూటీ తహసిల్దార్ యువరాజ్ తెలిపారు. సోమవారం నుండి 15 రోజులు పాటు రేషన్ కార్డులు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. కొత్త రేషన్ కార్డులు పొందేందుకు లబ్ధిదారులు అంతా అందుబాటులో ఉండాలని ఆయన విన్నవించారు.

స్వర్ణసాగరం



# శ్రీకాళహస్తిలో హెల్పింగ్ హాండ్స్ 165వ నెల సేవా కార్యక్రమం





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

శ్రీకాళహస్తిలోని హెల్పింగ్ హాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో 165వ నెల సేవా కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలు గల వారికి నిత్యావసర సరకులను పంపిణీ చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రత్యేక అవసరాలు గల వారికి నిత్యావసర సరకులను అందజేశారు. అనంతరం హెల్పింగ్ హాండ్స్ సంస్థపై రూపొందించిన నూతన గీతాన్ని ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ, హెల్పింగ్ హాండ్స్ సంస్థ చేపడుతున్న సేవా కార్యక్రమాలను ప్రశంసించారు. సంస్థ అధినేత మునీర్ భాషాను అభినందించారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవా కార్యక్రమాల్లో తాను కూడా భాగస్వామిగా ఉంటానని, తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని మునీర్ భాషాకు హామీ ఇచ్చారు. హెల్పింగ్ హాండ్స్ సంస్థ సేవా కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని, ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా పేదవారికి సహాయం చేయాలని ఆర్డీవో కోరారు. రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీ గురించి ప్రస్తావిస్తూ, రేపటి నుండి శ్రీకాళహస్తిలో 11,000 కు పైగా రేషన్ స్మార్ట్ కార్డులను ఐదు రోజుల పాటు ప్రజలకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి కేవైసీ ద్వారా స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారని, ప్రజలు ఇళ్ల వద్దనే ఉండి కార్డులను స్వీకరించాలని ఆయన కోరారు.

# కోలా ఆనంద్ కుమార్ ఘన సత్కారం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

రాష్ట్ర బిజెపి ఉపాధ్యక్షులుగా ఎన్నికైన కోలా ఆనంద్ కుమార్ బలిజ సోదరులు తమ నివాసంలో ఘనంగా సత్కరించారు. సిద్దులు ప్రసాద్, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, గంగుల పూడి సుబ్బారావు, నరేంద్రబాబు, సూరగారి రమేష్, పసుపులేటి గిరిధర్, బొక్కిసం మునిసుభయ్య, టౌన్ బ్యాంక్ భాస్కర్, ఏ ఎస్ ఐ ప్రసాద్, పురుషోత్తం బాబు, కప్పా హరికృష్ణ, మేస్త్రి ఆనంద్, పసుపులేటి నవీన్ కుమార్, జాజాల ముని, రమణ అనిల్, సాగి సతీష్, శ్యామ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని ఆనంద్ కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. బలిజ సోదరులతో పాటుగా ఇతర ప్రముఖులు కూడా శుభాకాంక్షలు అందజేశారు. కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది.

# టిడిపి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దాం




ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

టిడిపి అభివృద్ధికి కలిసికట్టుగా కృషి చేద్దామని ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అన్నారు. ఒంగోలు పార్లమెంటు విస్తృత సాయి సమావేశంలో ఆదివారం ఎమ్మెల్యే పాల్గొన్నారు. పార్లమెంటు పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతానికి నాయకులు కార్యకర్తలు సైనికుల పనిచేయాలన్నారుఏ ఎన్నికలు జరిగిన పార్టీ విజయం సాధించేలా పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలని ఆయన తెలిపారు.

# వ్యాయమ సాధనతో ఒత్తిడి దూరం.. కాలుష్య నివారణకు సైక్లింగ్ ఎంతో అవసరం

కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల ఆగస్టు 24

కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వం వారి ఉత్తర్వుల మేరకు ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ఆదివారం "సండేస్ ఆన్ సైకిల్ " కార్యక్రమాన్ని ప్రకాశం జిల్లా ఎస్పీ శ్రీ ఏ ఆర్ దామోదర్ ఐ పి ఎస్ ఆదేశాలు మేరకు వెలిగండ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది అందరూ ఎంతో ఉత్సాహంగా సైకిల్ ర్యాలీని నిర్వహించడం జరిగిందని వెలిగండ్ల ఎస్సై కృష్ణ పావని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కృష్ణ పావని మాట్లాడుతూ ఫిట్ ఇండియా సైకిల్ ర్యాలీ,ఒక ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒక కీలకమని మనిషి ఆరోగ్యం కేవలం వ్యక్తిగత ప్రయోజనం మాత్రమే కాదని, సమాజాన్ని, దేశాన్ని బలోపేతం చేసే శక్తిగా మారుతుందన్నారు. నేటి వేగవంతమైన జీవన శైలిలో ప్రతిరోజూ మనం ఎక్కువగా బైకులు మరియు కార్లలో ప్రయాణించడం ఒక అలవాటుగా మారిందని,

సైక్లింగ్ సాధారణ ఆరోగ్యపరిరక్షణ కోసం ఒక సరళమైన, సురక్షితమైన మార్గమని, ఇది కేవలం శరీరానికి మేలు చేయడం మాత్రమే కాక, పర్యావరణానికి కూడా మేలు చేస్తుందని, అందరూ ప్రజలు దీనిని తమ దైనందిన జీవనశైలిలో భాగం చేసుకోవాలని తెలిపారు. మనం రోజూ కొంతసేపు సైకిల్ వాడితే, ఆ పర్యావరణ భారం కొంతవరకూ తగ్గుతుందని, అది భవిష్యత్ తరాల కోసం మనం చేసే గొప్ప బహుమతిగా నిలుస్తుందన్నారు.

ప్రతి ఒక్కరు ఆరోగ్యంపై దృష్టి సారించాలని, ఆరోగ్యమే మహాభాగ్యం అన్న మాటను మన పెద్దలు ఎంతో దూర దృష్టితో చెప్పారని, మన జీవితాల్లో ఆరోగ్యం బలంగా ఉన్నప్పుడు, కుటుంబానికి, సమాజానికి, దేశానికి మనం మరింత మంచిగా సేవ చేయగలుగుతామనిప్రతి మనిషి తన జీవితంలో కొంత సమయాన్ని వ్యాయామానికి కేటాయించాలని,నడక, జాగింగ్, సైక్లింగ్ సాధన ప్రతి రోజు ఆచరిస్తే ఆరోగ్యం కోసం మనం చేసే ఈ చిన్న చర్యలు, భవిష్యత్‌లో పెద్ద మార్పులకు నాంది అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.






# మట్టితో తయారు చేసిన విగ్రహాలును వాడుకోవాలి



కమిషనర్ కృష్ణ మోహన్ రెడ్డి

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

కనిగిరి పట్టణాన్ని ప్లాస్టిక్ రహిత పట్టణంగా ఉండేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మునిసిపల్ కమీషనర్ పి. కృష్ణ మోహన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పండుగ సందర్భంగా మట్టితో తయారు చేసిన విగ్రహాలు ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు సహకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం రసాయనాలు, హానికర రంగులు, ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ లతో తయారు చేసిన వినాయక విగ్రహాలను వాడవద్దన్నారు. రసాయనాలతో తయారు చేసిన విగ్రహాలు నిమజ్జనం చేయడం వలన నీరు కలుషితం అవుతుందని తెలిపారు. కావున పుర ప్రజలు మట్టి విగ్రహాలను వాడి వాతావరణం కాలుష్యం కాకుండా చూడాలని కమీషనర్ కోరారు.

# హిందువుల మనోభావాలను దెబ్బతీస్తే ఊరుకోం

సమాజ్ వాజ్ రాష్ట్ర అధ్యక్షుడు పాశం వెంకటేశ్వర్లు



కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

గుంటూరు జిల్లా తక్కెళ్ళపాడు గ్రామంలో శ్రీకృష్ణుడి విగ్రహాన్ని ఎన్టీఆర్ రూపంలో నిర్మించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు కనిగిరి కి చెందిన సమాజ్ వాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పాశం వెంకటేశ్వర్లు ఖండించారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ టిడిపి నాయకులు శ్రీకృష్ణ భగవానుడు విగ్రహం ఏర్పాటు చేయడం మంచిదే కానీ విగ్రహాన్ని నందమూరి తారక రామారావు రూపంలో ఏర్పాటు చేయడం మంచిది కాదన్నారు. విగ్రహాన్ని ఏర్పాటు చేయటాన్ని విరమించుకోవాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు.

# పెద్ద చెర్లోపల్లి పోలీస్ స్టేషన్ ను వార్షిక తనిఖీ చేసిన కనిగిరి డి.ఎస్.పి శ్రీ సాయి ఈశ్వర్ యశ్వంత్









## పలు రికార్డులు, ఫైల్స్ తనిఖీ చేసి... సిబ్బందితో మాట్లాడి,వారికి ప్రస్తుతం పోలీస్ శాఖ వినియోగిస్తున్న టెక్నాలజీల గురించి సూచనలు ఇచ్చిన డీఎస్పీ

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

పోలీస్ స్టేషన్ వార్షిక తనిఖీలో భాగంగా స్టేషన్ పరిసరాలు, వివిధ గదులు,విధుల్లో ఉన్న సిబ్బంది పనితీరు, డ్యూటీల కేటాయింపు, రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ, ఫిర్యాదుల స్వీకరణ విధానం, మహిళా సహాయక కేంద్రం, రికార్డ్స్, సీడీ ఫైల్స్ మరియు తదితర అంశాలను సమీక్షించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో లా అండ్ ఆర్డర్, నేర నివారణ వ్యూహాలపై తీసుకుంటున్న చర్యలపై ఆరా తీసి %వాఎూ% కి పలు సూచనలు చేసారు. 194 %దీచీూ%, మిస్సింగ్ కేసులు మరియు పాత పెండింగ్ కేసులలో విచారణ త్వరగతిన పూర్తి చేయాలని, కేసుల విచారణకు చేపట్టవలసిన విధానం గురించి దిశానిర్దేశం చేశారు. నేరాలు కట్టడికి గస్తి మ-ంమ్ముమ్మరం చేయాలని, అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరంతర గస్తీ నిర్వహించేటట్లు, నైట్ బీట్ డ్యూటీ చేస్తున్న సిబ్బందిని తరచూ అప్రమత్తంగా చెయ్యాలని, డయల్-112 ఫిర్యాదులు రాగానే వెంటనే స్టేషన్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని సమస్య ను పరిష్కరి%శీ%చేటట్లు చూడాలని, రోడ్డు ప్రమాదాల నివారణకు మరింత ముందస్తు చర్యలు తీసుకోవాలని, విరివిగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని, స్టేషన్ లో వివిధ విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, విధుల పట్ల అంకితభావంగా ఉంటూ ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలకు సిసి కెమెరాల పట్ల అవగాహన కల్పించి వాటి ప్రాముఖ్యతను వివరిస్తూ ఇంకా కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు .గుడ్ టచ్ %ఃడ% బ్యాడ్ టచ్ పై విస్తృతంగా స్కూల్/కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించాలని, గంజాయి వంటి మాదక ద్రవ్యాలు సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, చట్టపరమైన చర్యల గురించి, సైబర్ నేరాలపై ప్రజలు మరియు విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. స్టేషన్ సిబ్బందితో పెరేడ్ నిర్వహించి వారికి తగు సూచనలు ఇవ్వడం జరిగింది. రాబోవు వినాయక చవితి సందర్భంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల ప్రజలందరూ వినాయక చవితినికమిటీ సభ్యులు తప్పనిసరిగా పరిమిషన్ తీసుకోవాలని నిమజ్జనానికి వెళ్లేటప్పుడు పోలీసు వారు ఇచ్చే సూచనలు పాటిస్తూ, ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా చూసుకోవాలని ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది. వినాయక నిమజ్జనాల సందర్భంగా ఎక్కడైనా గొడవలు జరిగినట్లయితే అట్టివారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా కనిగిరి డిఎస్పీగారైన శ్రీ సాయి ఈశ్వర్ యశ్వంత్ తెలియజేయడం జరిగింది. ఈ తనిఖీలలో కనిగిరి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎస్.కె ఖాజావలి,పి సి పల్లి ఎస్సై జి కోటయ్య పాల్గొన్నారు.

# తొట్టంబేడులో కొత్తరకం కబ్జాలు - ఈదులగుంట చెరువును మట్టి వ్యర్థాల చాటున మింగేస్తున్న ఆక్రమదారులు,



స్వర్ణ సాగరం- తొట్టంబేడు,

శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం కూత వేటులో ఉన్న ఈదులగుంట చెరువు మరోసారి కబ్జా బారిన పడుతోంది. ఒకప్పుడు గ్రామానికి జీవనాడిగా ఉన్న ఈ చెరువు, ఇప్పుడేమో భూబకాసురుల బారిన పడి కనుమరుగైపోతుందనే ఆందోళన వ్యాపిస్తోంది. స్థానికుల వివరాల ప్రకారం చెరువు సగం భాగం ఇప్పటికే ఆక్రమణకు గురైంది. ఇప్పుడు మిగిలిన భాగంపై కొత్త తరహాలో ముఠాలు దృష్టి సారించాయి. ట్రాక్టర్లతో మట్టి వ్యర్థాలను గుట్టలుగా నింపి, కొన్నాళ్ల తర్వాత చదును చేసి ప్లాట్లుగా అమ్మేందుకు ప్రయత్నం మొదలైంది. ఈ రహస్య కబ్జా పర్వం పత్రికల్లో ఎన్ని సార్లు వెలుగుచూసినా, రెవెన్యూ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. “చెరువులు, చెరువుల భూభాగాన్ని రక్షించడం మీ బాధ్యత కాదా?” అని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం చెరువును ఆనుకొని ఉన్న మట్టి రోడ్డుపై కబ్జా బాట మొదలైంది. ఈ దారిలో ఒక్క ప్లాటు కాదు, దాదాపు 20కి పైగా ప్లాట్లు చెరువు భూభాగంలోకి విస్తరించబోతున్నాయని గ్రామస్తులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. “ఇక ఈ వేగంలో కొనసాగితే చెరువు పూర్తిగా కనుమరుగైపోతుంది. మా భవిష్యత్ తరాలు నీటి కోసం ఆర్తనాదాలు చేయాల్సి వస్తుంది” అని స్థానికులు వాపోతున్నారు. “తక్షణమే ఎమ్మార్వో, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని ఈదులగుంట చెరువును రక్షించాలి” అని వారు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. గ్రామ పెద్దలు స్పష్టంగా చెబుతున్నారు %-% “చెరువులు ఉంటేనే నీరు ఉంటుంది, నీరు ఉంటేనే జీవనం ఉంటుంది. చెరువును కాపాడటం సమాజం మొత్తానికి మేలు చేస్తుంది” అని. చెరువులను కబ్జా చేసుకుని ప్లాట్ల వ్యాపారం చేసేవారిని కఠినంగా శిక్షించి, మిగిలి ఉన్న చెరువు భూభాగాన్ని తక్షణమే రక్షించే చర్యలు చేపట్టాలని ప్రజల కోరుతున్నారు.

## స్వామి చూపిన మార్గంలో ఆధ్యాత్మిక సేవకు సాధన - ప్రత్య సాయి సేవా సంస్థ,



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,

ప్రపంచవ్యాప్తంగా జరగబోయే భగవాన్ శ్రీ సత్యసాయి బాబా 100వ జన్మదినోత్సవ వేడుకలలో భక్తులకు అందించవలసిన సేవలపై దిశానిర్దేశం చేసేందుకు శ్రీ సత్య సాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి సేవాదళ్ శిక్షణ శిబిరం శ్రీకాళహస్తిలో జరిగింది.

పట్టణంలోని ముత్యాలమ్మగుడి వీధి సాయిబాబా మందిరం ప్రాంగణంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు చుండూరు సురేంద్ర, రాష్ట్ర సేవా కోఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్, రాష్ట్ర జాయింట్ కోఆర్డినేటర్ విశ్వనాథరెడ్డి, రాష్ట్ర యువత కోఆర్డినేటర్ గౌతమ్ పాల్గొని భక్తులకు అందించవలసిన సేవలు, యువత చేపట్టాల్సిన కార్యక్రమాలపై మార్గదర్శనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ %-% “స్వామి చూపిన మార్గంలో నడుస్తూ మానవసేవే మాధవసేవ అనే తత్త్వాన్ని ప్రతి సేవాకార్యక్రమంలో నిలబెట్టాలి. రాబోయే వందవ జయంతి వేడుకలకు లక్షలాది మంది భక్తులు ప్రశాంతి నిలయానికి విచ్చేస్తారు. వారికి సేవ చేయడం అనేది స్వామివారిని సేవించినంత పుణ్యప్రదమైందే” అని పేర్కొన్నారు. శిక్షణ శిబిరంలో ప్రశాంతి సేవల ప్రాముఖ్యత, నిత్య నారాయణ సేవ, గ్రామ సేవలు, మహిళా పాత్ర, యువత సేవా కార్యక్రమాలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు అమర్నాథ్, జిల్లా స్థాయి పదాధికారులు, సమితి కన్వీనర్లు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి సమితి కన్వీనర్ పాండురంగయ్య మరియు వారి బృందం వచ్చిన వారికి తగిన ఏర్పాట్లు చేశారు.

మంగళహారతితో ఈ శిక్షణ శిబిరం ముగిసింది.

## పరిశ్రమ వ్యర్ధ జలాలతో నాలుగు ఆవులు మృతి





పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 24.

మండలంలోని పాలచూరు గ్రామంలో ఉన్న రామ్ కో ఎన్విరో ఇంజనీరింగ్ పరిశ్రమ నుండి విడుదలవుతున్న వ్యర్థ జలాలను మోగి జీవోలు తాగడం వల్ల ఆదివారం గ్రామానికి చెందిన నాలుగు ఆవులు మృత్యువాత పడ్డాయి. బాధితుల సమాచారం మేరకు గ్రామంలో ఉన్న ఓ భారీ కంపెనీకి అనుబంధంగా ఉన్న రామ్కో ఎన్విరా ఇంజనీరింగ్ పరిశ్రమ నుండి విడుదల అవుతున్న వ్యర్ధ జలాలు దిగో ప్రాంతంలోకి నిర్లక్ష్యంగా వదిలేస్తున్నారు దాంతో అటుగా వెళ్లిన మూగచి వాళ్ళు పెద్ద జలాలను తాకి మృత్యువాత పడుతున్నాయి ఈ క్రమంలో ఆదివారం గ్రామానికి చెందిన కాటూరు గోవర్ధన్, బట్ట వెంకటసుబ్బయ్య, బట్ట రమేష్ లకు చెందిన నాలుగు ఆవులు మృతి చెందాయి. ఈఘటనలో సుమారు రెండు లక్షలకు పైగా నష్టం వాటిలిందని బాధితులు సంబంధిత ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

# పందెం రాయుళ్లపై పోలీస్ వేట

### - మండలంలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు - సీఐ శ్రీకాంత్ రెడ్డి



ఏర్పేడు-స్వర్ణసాగరం ఆగస్టు 24

రేణిగుంట డివిజన్లోని ఏర్పేడు మండల పరిధిలో తిరుపతి జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఐపిఎస్., ఆదేశాలతో రేణిగుంట సబ్ డివిజన్ లో ఎస్పీ స్పెషల్ పార్టీ పోలీసు సిబ్బంది తో డ్రోన్ కెరేణిగుంట సబ్ డివిజన్ పరిధిలో జంగాలపల్లి, మద్దిలేడు, దుర్గిపెరి,శివగిరి కాలనీ, కాట్ర కాయలగుంటజంగాలపల్లి ఎస్టీ కాలనీ లలో డ్రోన్ కెమెరా తో బీట్ నిర్వహించడం జరిగింది. చిందేపల్లి ఎస్టీ కాలనీలోని పొలాలలో గుంపుగా చేరి కోడి పందాలు నిర్వహిస్తున్నట్లు డ్రోన్ కెమెరా గుర్తించడం జరిగింది. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తిరుపతి నుండి స్పెషల్ పార్టీ టీం, సైబర్ క్రైం ఇన్స్పెక్టర్ డ్రోన్ కెమెరాల ఇంచార్జి వినోద్ కుమార్ గారి పర్యవేక్షణలో 10 మంది పోలీసు సిబ్బంది కోడిపందాలను నిర్వహించు వారిపై ఏకకాలంలో దాడులు చేశారు. పోలీసు సిబ్బందిని చూసిన కోడి పందాలు ఆడేవారు, కోడి పందాల నిర్వహకులు పోలాలలోకి పరుగుపెట్టారు. పోలీసు సిబ్బంది కోడి పందాలు ఆడేవారిని, నిర్వహికులను పరుగు పెట్టిన వారిని 25 మందిని అదుపులోకి తీసుకోవడం జరిగింది. లివారి నుండి 11 కోడి పుంజులను, 61,116 రూపాయలు నగదు, 29 సెల్ ఫోన్స్, 30 బైక్స్, 12 కోడికత్తులను స్వాధినం చేసుకోవడం జరిగింది. లివీరందరిని ఏర్పేడు పోలీసు స్టేషను కు తరలించి కేసు నమోదు చేయడం జరిగింది.

మిగిలిన వారి కోసం పోలీసు వారు గాలిస్తున్నారు.

తిరుపతి జిల్లా లో కోడి పందాలు ఎక్కడ నిర్వహించిన , కోడి పందాలు ఆడిన అలాంటి వారి పై కఠినమైన చర్యలు తీసుకుంటామని పోలీసు వారు హెచ్చరించడమైనది. జిల్లా వ్యాప్తంగా అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన, పేకాటలు నిర్వహించిన, కోడి పందాలు నిర్వహించిన అలాంటి వాటిపై ఉపేక్షించేది లేదన్నారు. మీ గ్రామంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయని మీకు సమాచారం వస్తే...80999 99977 సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్పీ అన్నారు.

మీ ప్రాంతాలలో, మీ గ్రామాలలో మీరే సైనికులు గా ఉండి కాపాడుకొవాల్సిన భాధ్యతల ప్రతిఒక్కరు పైన ఉందన్నారు. నీకు ఎలాంటి కష్టం వచ్చిన పోలీసు వారు ఎప్పుడూ అండగా ఉంటామని ఎస్పీ అన్నారు. చేయి.. చేయి కలుపుద్దాం...మన గ్రామంలో ఉన్న దుష్టశక్తులను పారదోలదాం అనే నినాదం తో ముందుకు వెళ్ళద్దామని ప్రజలకు ఎస్పీ గారు బరోసా ఇచ్చారు. అంతేకాకుండా నిరంతరం జిల్లా వ్యాప్తంగా పది డ్రోన్ కెమెరాలతో ప్రతి డివిజన్ లో ఇప్పటికే పగలు, రాత్రి పూట బీట్లు ఎర్పాటు చేసి, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్న నిర్మానుష గల ప్రాంతాల్లో నిఘా పెట్టడం జరిగినది.

## బాల్యవివాహాలు - చిన్న వయసులో గర్భధారణ దుష్పరిణామాలపై అవగాహన



న్యాయ సేవాధికార సంస్థ

కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

రాష్ట్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ జూనియర్ సివిల్ జడ్జి బి. రూపశ్రీ నేతృత్వంలో ఆదివారం కాశిరెడ్డి గిరిజన కాలనిలో బాల్యవివాహాలు %-% చిన్న వయసులో గర్భధారణ దుష్పరిణామాలు అనే అంశం పై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్ న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ప్రభుత్వం ప్రొహిబిషన్ అఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ %-% 2006 ద్వారా బాల్యవివాహాలను నిషేధించిందని ప్రజలు బాల్యవివాహాలను నిరోధించి, బాలికలకు విద్య అందించి, ఆరోగ్యవంతమైన భవిష్యత్తు కల్పించాలని అన్నారు. ఇంకా కొన్ని ప్రాంతాలలో బాల్యవివాహాలు జరుగుతున్నాయని 18 సంవత్సరాల లోపు అమ్మాయిల వివాహం చట్టవిరుద్ధమేకాక, వారి ఆరోగ్యం, భవిష్యత్తుకు హాని కలిగిస్తుందని అన్నారు. చిన్న వయసులో గర్భధారణ వల్ల రక్తహీనత, అకాల ప్రసవం, శిశుమరణాలు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. అనంతరం బాల్య వివాహాలు జరగకుండా చూస్తామని కాలనీ వాసులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు గుడ్ హెల్ప్ రమేష్ బాబు, ఐ సి డి ఎస్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్, జి ఎస్ అండ్ జి డి కె ఫౌండేషన్ చైర్మన్ గంధం శ్యామ్యూల్ గెర్షోమ్, కోఆర్డినేటర్ నవకుమార్, ఆర్నూరి తిరుపతయ్య స్థానిక వాసులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తీశ్వరస్వామిని దర్శించిన రామేశ్వరం ఎమ్మెల్యే ఖాదర్ బాషా అలియాస్ ముత్తు రామలింగన్,



స్వర్ణ సాగరం- శ్రీకాళహస్తి,

శ్రీకాళహస్తి నియోజక వర్గం శ్రీకాళహస్తి లోని రామేశ్వరం ఎమ్మెల్యే ఖాదర్ బాషా అలియాస్ ముత్తు రామలింగన్ ఆదివారం శ్రీకాళహస్తీశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. దేవస్థానం మాజీ పాలక మండలి సభ్యులు బుల్లెట్ జై శ్యామ్ రాయల్, మున స్వామి రాయల్ దక్షిణ గోపురం వద్ద ఎమ్మెల్యేకు సాదర స్వాగతం పలికారు. అనంతరం ఆలయ అర్చకులు ప్రత్యేకంగా స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. తరువాత వేదపండితులచే ఎమ్మెల్యేకు ఆశీర్వచనం చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు సూర్య, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎదురెదురుగా రెండు మోటార్ బైకులు ఢీ ఒకరు మృతి మరొకరికి గాయాలు








పెళ్లకూరు స్వర్ణసాగరం ఆగస్టు 24.

71వ నంబరు జాతీయ రహదారి మార్గంలో చిల్లకూరు గ్రామం వద్ద ఆదివారం రాత్రి రెండు మోటార్ బైకులు ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో చమర్తి కృష్ణయ్య (39) తలపై తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. చీర రోశయ్యకు ముఖం పైన తల మీద గాయాలైనాయి. స్థానికులు, పోలీసులు సమాచారం మేరకు వివరాలు. చిల్లకూరు వడ్డీ పాలెం గ్రామానికి చెందిన చెమర్తి కృష్ణయ్య నాయుడుపేటలో పనులు ముగించుకుని తిరిగి మోటార్ బైక్ లో స్వగ్రామం వడ్డీ పాలెం బయలుదేరి వెళుతున్నాడు. అదే సమయంలో చీర రోశయ్య చిల్లకూరు దళిత కాలనీలో వివాహ రిసెప్షన్ చూసుకొని తిరిగి కోటకు వెళ్లేందుకు మోటార్ బైక్ లో బయలుదేరి చిల్లకూరు వద్ద ఫ్లై ఓవర్ దాటుకుని వ్యతిరేక మార్గంలో నాయుడుపేటకు వెళుతున్నాడు. సర్వీస్ రోడ్డును దాటుకుని హైవే రోడ్డు ఎక్కే క్రమంలో ఎదురుగా వస్తున్న మోటార్ బైక్ ను ఢీకొన్నాడు. ఈ ఘటనలో చమర్తి కృష్ణయ్యకు తల పైన తీవ్ర రక్త గాయాలై అక్కడే మృతి చెందాడు. రోశయ్యకు తల మీద మొఖం పైన రక్త గాయాలైనాయి. స్థానికులు చికిత్సల నిమిత్తం రోశయ్యను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మృతి చెందిన కృష్ణయ్యను పోస్టుమార్టం నిమిత్తం నాయుడుపేటకు తరలించారు. మృతుడు కృష్ణయ్యకు భార్య మోహనమ్మ, కుమార్తెలు చంద్రలేఖ, ప్రవీణ, కుమారుడు శ్రీనాథ్ ఉన్నారు. ఈ మేరకు పోలీసుల కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పం వారిచే ఉచిత గుండె ఈ యేన్ టి శిబిరం



కుప్పం స్వర్ణ సాగరం న్యూస్

లయన్స్ క్లబ్ ఆఫ్ కుప్పంవారియర్స్ వారిచే బి. ఆర్. డి హాస్పిటల్ నందు బ్రెయిన్స్ హాస్పిటల్ , అల్టియస్ హాస్పిటల్ బెంగళూరు వారిచే ఉచిత గుండె, న్యూరో , ఈ. యెన్. టి శిబిరం దిగ్విజయంగా జరిగింది. ఈ శిభిరానికి 100 మందికి పైగా హాజరు అయ్యారు. వారిలో 6 మందికి ఉచిత గుండె శస్త్రచికిత్సకు మరియు 3 మందిని ఉచిత నాడి శస్త్రచికిత్సకు సిఫార్సు చేయడం జరిగింది. ఈ సందర్భంగా బి. ఆర్. డి హాస్పిటల్ అధినేత డా. సురేష్ బాబు , లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ మాట్లాడుతూ కుప్పం ప్రాంత ప్రజల కోసం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించాలానే ఉద్దేశంతో ఇలాంటి ఉచిత శిబిరాలు నిర్వహిస్తున్నామని ఈ అవకాశాన్ని కుప్పం ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోని ఆరోగ్య కుప్పంగా తీర్చిదిద్దాలని పిలుపునిచ్చారు . అలాగే బ్రెయిన్స్ హాస్పిటల్ , అల్టియస్ హాస్పిటల్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డా . నితిన్ ప్రకాష్, డా. కార్తీక్, లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా. సుదర్శన్ సభ్యులు సెల్వం, సెంథిల్ కుమార్, చరణ్, ప్రసాద్, డా. కృష్ణమూర్తి , ఏకాంబరం పి ఆర్ ఓ లు రాజకుమార్,మని, మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# పిల్లల ఆహారంలో రాజీ లేదు బొజ్జల బృందమ్మ ఆకస్మిక తనిఖీలు





### పిల్లల ఆహారంలో రాజీ లేదు: బొజ్జల బృందమ్మ

స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

వసతి గృహాల పిల్లలను స్వంత పిల్లల్లా చూసుకోవాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తల్లి బొజ్జల బృందమ్మ హెచ్చరించారు. ఆదివారం రేణిగుంట బీసీ వసతి గృహం, విమానాశ్రయం గురుకుల పాఠశాలలో ఆమె ఆకస్మిక తనిఖీలు చేశారు. గురుకుల పాఠశాలలో ఆహార నాణ్యత చూసి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ప్రభుత్వం పిల్లల ఆరోగ్యానికి పూర్తి ప్రాధాన్యత ఇస్తున్నారని, నాణ్యమైన ఆహారం అందిస్తున్నారని, నిర్వాహకుల నిర్లక్ష్యంపై ఆమె ప్రశ్నించారు. మళ్ళీ తనిఖీకి వస్తానని, అప్పుడు కూడా ఇలాగే ఉంటే చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పిల్లలకు మంచి ఆహారం అందించడంలో ప్రభుత్వం వెనకడుగు వేయదని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, నాయకులు బాబు, రవి, కన్నన్ రెడ్డి, దినేష్, మేరీ, జయ, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

# వితంతువులకు నిత్యవసర సరుకులు పంపిణీ





కనిగిరి స్వర్ణ సాగరం ఆగస్టు 24

ప్రకాశం జిల్లా కనిగిరి మండలం చిన్న ఇర్ల పాడు గ్రామంలో ఎస్ సి కాలనీలో తెలుగు బాప్టిస్ట్ చర్చ్ సంఘ విశ్వాసులకు వితంతువులకు నిత్యవసర సరుకులు పంపిణీచేయడమైనది.తెలుగు బాప్టిస్ట్ చర్చ్. సంఘకాపరి సాల్మన్ రాజు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణం ఎడ్నమ్మ మెమోరియల్ క్రిస్టియన్ ఫౌండేషన్ ఆత్మకూరు వారిని చర్చి నందు వితంతువులు పేదవారు ఉన్నారని నిత్యవసర సరుకులు పంపిణీ అవసరంగా ఉన్నది కనుక ఇవ్వవలసిందిగా కోరినారు. వారి కోరిక మేరకు నిత్యవసర సరుకులు పంపిణీ పి ఎడ్వర్డ్ పంపిణీ చేయడమైనది. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి పాస్టర్ సాల్మన్ పాస్టర్ ఇర్మియ పాస్టర్ జయ రావు పాస్టర్ ప్రసాద్ పాస్టర్ రాజు పాస్టర్ ప్రేమ్ కుమార్ బ్రదర్ రవి కార్యనిర్వాహకులు పి ఎడ్వర్డ్ మాట్లాడుతూ పేదలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తూ ఉన్నామని తెలియజేశారు.

# సబ్సిడీ రూపంలో మొక్కజొన్నల విత్తనాల పంపిణీ కార్యక్రమం



శాంతిపురం స్వర్ణ సాగరంన్యూస్

శాంతిపురం మండలం చిన్నారి దొడ్డి పంచాయితీ చిన్నారి దొడ్డి గ్రామ సచివాలయం ముందర సబ్సిడీ మొక్కజొన్నల పంపిణీ కార్యక్రమం పంచాయతీ అధ్యక్షులు శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ కార్యక్రమంలో రెస్కో డైరెక్టర్ చరణ్ కుమార్, హరినాథ్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ సురేష్ రెడ్డి, వెటర్నరీ సిబ్బంది లవ్ కుమార్ గ్రామస్తులు పాల్గొన్నారు

# సిపిఐ 28వ రాష్ట్ర మహాసభలు - ఒంగోలు








స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

ప్రకాశం జిల్లా ఒంగోలు పట్టణంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 28వ రాష్ట్ర మహాసభలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సభలకు రాష్ట్ర నలుమూలల నుండి సిపిఐ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ రామకృష్ణ ఈ సభలకు అధ్యక్షత వహించి, పార్టీ బలోపేతం, ప్రజా సమస్యలపై పోరాటం వంటి అంశాలపై దీర్ఘంగా ప్రసంగించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలను ఆయన తీవ్రంగా ఖండించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ శ్రీనివాస రావు కూడా ఈ సభలకు ముఖ్య అతిథిగా విచ్చేసి, కమ్యూనిస్టు పార్టీల ఐక్యత, సామాజిక న్యాయం కోసం కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ కార్యదర్శి జనమాల గురవయ్య కూడా ఈ సభలకు హాజరై, తన నియోజకవర్గంలో పార్టీ కార్యకలాపాలను వివరించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ప్రసంగించి, ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన సిపిఐ కార్యకర్తలు, అభిమానులు ఈ సభలను విజయవంతం చేశారు. ఈ సభల్లో పార్టీ భవిష్యత్ కార్యాచరణపై చర్చించి, తీర్మానాలు చేయనున్నారు.

# భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 28వ రాష్ట్ర మహాసభలు - ఒంగోలు





స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

సామ్యవాద సమాజ స్థాపన అనే ఉన్నత లక్ష్యంతో శతాబ్ద కాలంగా త్యాగాల పరిమళాలతో, అలుపెరుగని పోరాటాలతో వెలుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 28వ రాష్ట్ర మహాసభలు ప్రకాశం జిల్లా ఒంగోలులో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సభలకు రాష్ట్ర నలుమూలల నుండి ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సామాజిక న్యాయం, ఆర్థిక సమానత్వం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ కోసం సీపీఐ నిరంతరం కృషి చేస్తూ, ప్రజల పక్షాన నిలబడుతూ వస్తోంది. ఈ మహాసభల్లో పార్టీ భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చర్చించి తీర్మానాలు చేయనున్నారు. రాష్ట్రంలోని ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, ప్రజల సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలు మేధోమథనం చేస్తున్నారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నుండి సీపీఐ జిల్లా ప్రతినిధిగా కత్తి రవి హాజరయ్యారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన కృషి చేస్తారని ఆశిస్తున్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుండి వచ్చిన ప్రతినిధులతో కలిసి కత్తి రవి కీలక చర్చల్లో పాల్గొంటున్నారు.

# కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి తిరుపతి పర్యటన ఘన స్వాగతం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి, జి. కిషన్ రెడ్డి తిరుపతి పర్యటన సందర్భంగా, తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కోలా ఆనంద్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కిషన్ రెడ్డి పూలమాలలు వేసి, శాలువాలతో సత్కరించి, ఆత్మీయంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి బీడీ బాలాజీ, జిల్లా కార్యవర్గ సభ్యులు రమణారెడ్డి, మండల అధ్యక్షులు ప్రేమ్ కుమార్ రెడ్డి, ఉపాధ్యక్షులు రాజారాయలు, ఆనంద్, వేణుగోపాల్, రాము తదితరులు పాల్గొని మంత్రిగారికి ఘన స్వాగతం పలికారు. మంత్రి తిరుపతి పర్యటన సందర్భంగా వివిధ కార్యక్రమాలలో పాల్గొననున్నారు. తిరుమల వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవడంతో పాటు, స్థానిక నాయకులతో సమావేశమై పార్టీ కార్యక్రమాలను సమీక్షించనున్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ బలోపేతం, ప్రజలకు చేరువయ్యే కార్యక్రమాలపై చర్చించనున్నారు. అంతేకాకుండా, స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకుని, అందుబాటులో ఉంటామని మంత్రి కిషన్ రెడ్డి తెలియజేశారు. పార్టీ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొని మంత్రి స్వాగతం పలికారు. భారీ సంఖ్యలో కార్యకర్తలు విమానాశ్రయానికి తరలివచ్చారు.

# అక్షర స్కూల్ విద్యార్థుల ప్రతిభ

రామకుప్పం స్వర్ణ సాగరం న్యూస్



కళా తరంగణి నృత్య పోటీల్లో రామకుప్పం దియా డాన్స్ స్టూడియో అధ్వారంలో కుప్పం డిగ్రీ కాలేజ్ నందు పోటీలు నిర్వహించగా, రామకుప్పం అక్షర స్కూల్ విద్యార్థులు ప్రైస్ అండ్ సర్టిఫికెట్ పొందినారు విద్యార్థుల తల్లిదండ్రులు డాన్స్ పోటీల్లో మా పిల్లలు ప్రతిభ కనబరిచినందుకు అక్షర స్కూల్ యాజమాన్యానికి డిఆర్ డాన్స్ స్టూడియో వారికి చాలా కృతజ్ఞతలు అని తెలియజేశారు ఈ కార్యక్రమంలో డిఆర్ డాన్స్ స్టూడియో దినేష్ బాబు చందు ఉదయ్ సుదర్శన్ పవన్ , అక్షర స్కూల్ యాజమాన్యం పాల్గొన్నారు

# భారతీయ జనతా పార్టీ జెండాలతో కాషాయమైన నాయుడుపేట.

### బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి కి ఘన స్వాగతం పలికిన నాయుడుపేట యువత...

### బిజెపి పట్టణ అధ్యక్షులు పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం...

### 1000 బైక్ లతో ఘన శోభయాత్ర





స్వర్ణ సాగరం (నాయుడుపేట) ఆగస్టు 24.

తిరుపతి జిల్లా నాయుడుపేట లో బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డికి ఘన స్వాగతం పలకడం జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ బిజెపి రాష్ట్ర నూతన బాధ్యతలు లను ప్రకటించిన ప్రక్రియలు నాయుడుపేటకు చెందిన సన్నారెడ్డి దయాకర్ రెడ్డి కి రెండోసారి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాధ్యతను అప్పగించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మొదటి సారి నాయుడుపేట కూర్చున్న సందర్భంగా పట్టణ అధ్యక్షులు పాపిరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం జరిగింది అదేవిధంగా సుమారు 1000 బైకులపైగా పిక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. డిఎస్ఆర్ కళ్యాణమండపం నుండి ప్రారంభమై బస్టాండ్ వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి సమర్పించడం జరిగింది. యధావిధిగా అంబేద్కర్ విగ్రహం నుండి నాయుడుపేట నడిబొడ్డున వెలసిన గ్రామ దేవత పోలేరమ్మకి గుడివాడ హాయ్ దండం పెట్టుకోవడం జరిగింది. బైక్ ర్యాలీలు తన నివాసం వద్దకు చేరుకోవడం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ర్యాలీలో పాల్గొన్న నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు ధన్యవాదాలు తెలియజేశారు. అదే విధంగా రెండోసారి పార్టీ నాపై నమ్మకం ఉంచి బాధ్యత ఇచ్చిన రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ నరేంద్ర మోడీ గారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ద్వారా బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు సహాయం



స్వర్ణ సాగరం శ్రీకాళహస్తి రూరల్

ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు దుస్తులు మరియు షూలు పంపిణీ చేయబడ్డాయి. ఈ నెల 29, 30, 31 తేదీలలో ప్రకాశం జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులకు ఈ సదుపాయం కల్పించబడింది. ఈ పోటీలలో రాష్ట్రం నలుమూలల నుండి ఎంపికైన ప్రతిభావంతులైన క్రీడాకారులు పాల్గొంటున్నారు. వీరందరికీ ఎస్.ఆర్. చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో నాణ్యమైన క్రీడా దుస్తులు మరియు షూలు అందజేయడం జరిగింది. ఇలాంటి సహాయ సహకారాలు క్రీడాకారులకు చాలా అవసరం మరియు వారి ఆత్మస్థైర్యాన్ని పెంపొందిస్తాయి. పసుపులేటి కోదండరామయ్య మరియు పసుపులేటి పార్థసారథి ఈ క్రీడా దుస్తులను అందజేశారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, జిల్లా స్థాయి నుండి రాష్ట్ర స్థాయికి, అక్కడి నుండి జాతీయ స్థాయికి, అంతర్జాతీయ స్థాయికి కూడా ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడలలో రాణించడం ద్వారా వ్యక్తిగత వికాసం తోపాటు దేశానికి కూడా పేరు ప్రఖ్యాతులు తెస్తారని అన్నారు. క్రమశిక్షణ, అంకితభావం, కృషి వంటి గుణాలు క్రీడాకారులకు చాలా ముఖ్యమని నొక్కి చెప్పారు. మహిళలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని, క్రీడలు, ఉద్యోగం, విద్య, రాజకీయాలు, వ్యాపారం వంటి అన్ని రంగాల్లోనూ రాణించాలని ప్రోత్సహించారు. మహిళలు సమాజంలో సమాన స్థాయిలో పురుషులతో పోటీపడి ముందుకు సాగాలని, స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే శక్తిని కలిగి ఉండాలని వారు అభిప్రాయపడ్డారు. అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తమ ట్రస్ట్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్రీడాకారుల శిక్షణ, పోటీల నిర్వహణ, క్రీడా సామగ్రి సమకూర్చడం వంటి వివిధ రకాలుగా సహాయం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాజశేఖర్, ఫిజికల్ డైరెక్టర్ నరసింహారావు, చిత్తూరు జిల్లా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటస్వామి, క్రాంతి కుమార్, స్థానిక నాయకులు, క్రీడా ప్రముఖులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చాలా గ్రాండ్ గా నిర్వహించబడింది మరియు క్రీడాకారులందరికీ చాలా ఉత్సాహాన్ని కలిగించింది



## అల్లు అర్జున్ రిజెక్ట్ చేసిన సినిమా.. కట్ చేస్తే ఎన్టీఆర్ బ్లాక్ బస్టర్..

టాలీవుడ్ లోనే కాదు.. ఏ సినిమా ఇండస్ట్రీలోనైనా కథలు, సినిమాలు చేతులు మారడమన్నది కామన్. ఒక హీరో చేయాల్సి సినిమా వివిధ కారణాలతో వేరే హీరో దగ్గరకు వెళ్లడం ఇక్కడ పరిపాటిగా జరుగుతూ ఉంటోంది. అలా చేతులు మారిన సినిమాలు ఒక్కోసారి బ్లాక బస్టర్ హిట్ అవ్వొచ్చు.. మరోసారి బాక్సాఫీస్ వద్ద బోల్తా పడవచ్చు. పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న టాలీవుడ్ స్టార్ హీరోలు అల్లు అర్జున్, ఎన్టీఆర్ ల విషయంలో కూడా ఒకసారి ఇది జరిగింది. పుష్ప సినిమాతో అల్లు అర్జున్ రేంజ్ బాగా పెరిగిపోయింది. పాన్ ఇండియా స్థాయిలో ఫేమస్ అయిపోయాడు. అయితే ఈ సినిమా రిలీజైన వెంటనే ఓ స్టార్ డైరెక్టర్ తో తర్వాతి ప్రాజెక్టును అనౌన్స్ చేశాడు బన్నీ. అల్లు అర్జున్ 21వ సినిమాగా అధికారిక ప్రకటన కూడా వచ్చింది. సినిమాకు సంబంధించిన పోస్టర్ కూడా రిలీజ్ చేశారు. కథ, స్క్రీన్ ప్లే కూడా సిద్ధమైంది. అయితే ఏమైందో తెలియదు కానీ ఈ ప్రాజెక్టు ఆగిపోయింది. కట్ చేస్తే.. అదే స్టార్ డైరెక్టర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా ఓ మూవీని ప్రకటించాడు. అల్లు అర్జున్ సినిమాకు అనుకున్న నిర్మాతలనే తారక్ మూవీకి కూడా సెట్ చేశాడు. కట్ చేస్తే.. ఈ సినిమా బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఆర్ఆర్ఆర్ తర్వాత ఎన్టీఆర్ కు మరో పాన్ ఇండియా హిట్ ఖాతాలో పడింది.



## 90 కోట్లతో తీస్తే 9 కోట్లు లేదు.. బాక్సాఫీస్ వద్ద దారుణమైన డిజాస్టర్

ప్రస్తుతం తెలుగులో భారీ బడ్జెట్ పాన్ ఇండియా సినిమాలను ఎక్కువగా రూపొందిస్తున్నారు. కానీ కొన్నిసార్లు కథ బలంగా ఉంటే బడ్జెట్ కంటే ఎక్కువ ఖర్చు చేయడం పర్వలేదు. కానీ హీరో మార్కెట్ విలువకు రెండింతలు బడ్జెట్ ఖర్చు చేస్తే కథపై ఎంతో నమ్మకం ఉండాలి. కరోనా తర్వాత, నిర్మాతలు బడ్జెట్ విషయంలో చాలా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. అందుకే ఇప్పుడు సినిమా బడ్జె విషయంలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో భారీ బడ్జెట్ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద అట్టర్ ప్లాప్ అవుతున్నాయి. ఇటీవల తెలుగులో భారీ అంచనాల మధ్య విడుదలైన సినిమాలు అంతగా ఆకట్టుకోలేకపోయాయి. ఇక మరికొన్ని సినిమాలు బడ్జెట్ వరకు మాత్రమే కలెక్షన్స్ రాబట్టింది. కానీ తెలుగులో 90 కోట్లతో నిర్మిస్తే 9 కోట్లు కూడా రాబట్టలేకపోయిన ఈ సినిమా గురించి మీకు తెలుసా.. ? అదే అఖిల్ అక్కినేని హీరోగా నటించిన సినిమా 'ఏజెంట్'. ఈ సినిమా దాదాపు రెండు సంవత్సరాల క్రితం విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద అతిపెద్ద డిజాస్టర్ అయ్యింది. అఖిల్ కెరీర్ ప్రారంభమై తొమ్మిది సంవత్సరాలు అయ్యింది. కానీ ఇప్పటివరకు సరైన బ్రేక్ అందుకోలేకపోయాడు. అఖిల్ నటించిన ఫస్ట్ మూవీని రూ.50 కోట్లతో నిర్మించారు. కానీ ఈ సినిమా అంతగా ఆకట్టుకోలేకపోయింది. ఆ తర్వాత వచ్చిన హలో సినిమా సైతం థియేటర్లలో డిజాస్టర్ అయ్యింది. మిస్టర్ మజ్ను సినిమా ప్లాప్ కాగా.. బొమ్మరిల్లు భాస్కర్ రూపొందించిన మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ మూవీ పర్వాలేదనిపించింది. ఇక ఆ తర్వాత డైరెక్టర్ సురేంద్రరెడ్డితో కలిసి ఏజెంట్ చిత్రం చేశాడు అఖిల్.

# వాళ్లకి నడుము, బొడ్డు పిచ్చి ఉంది

### సౌత్ ఇండస్ట్రీపై నటి సంచలన వ్యాఖ్యలు

సౌత్ ఫిల్మ్ ఇండస్ట్రీలో హీరోయిన్ల నడుము అందాలను, బొడ్డును చూపించే 'పిచ్చి' ఉందంటూ బాలీవుడ్ నటి డైసీ షా సంచలన వ్యాఖ్యలు చేసింది. ఒక కన్నడ సినిమాలో హీరోయిన్‌గా నటించిన టైంని గుర్తు చేసుకుంటూ తన అనుభవాలను పంచుకుంది. బాలీవుడ్ కంటే సౌత్‌లో బొడ్డు, నడుమును ఎక్కువగా చూపించడం చూశానని ఆమె చెప్పింది. ముఖ్యంగా, ఒకసారి తాను కన్నడ ఛానెల్ చూస్తుండగా, అందులో ఒక నటుడు హీరోయిన్ నడుముపై పండ్లు వేసి, ఆమె నడుముని సలాడ్‌గా మార్చాడని డైసీ చెప్పుకొచ్చింది. హీరోయిన్ల నడుము, పొట్టపై కెమెరా క్లోజప్ షాట్లు ఎక్కువగా పెట్టడం అన్ని ఇండస్ట్రీల్లో సాధారణమే అయినా, సౌత్‌లో అవి చాలా ఎక్కువగా ఉంటాయని ఆమె అభిప్రాయపడింది. డైసీ షా వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విభిన్న స్పందనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో నటీమణులు తాప్సీ పన్ను మరియు పూజా హెగ్డే కూడా ఇలాంటి అంశాలపై తమ అభిప్రాయాలను పంచుకున్నారు.








## పవన్ కళ్యాణ్ 'ఓజీ'పై భారీ అంచనాలు.. అప్పుడే అడ్వాన్స్ బుకింగ్స్ కూడా మొదలు

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందిన హిస్టారికల్ వార్ డ్రామా 'హరిహర వీరమల్లు' ప్రేక్షకుల అంచనాలను అందుకోలేకపోయినప్పటికీ, ఇప్పుడు ఆయన అభిమానులు 'ఓజీ' సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. ఈ సినిమాకు సంబంధించి ఇటీవల కొన్ని పుకార్లు చక్కర్లు కొట్టినా, చిత్ర బృందం వాటికి చెక్ పెట్టింది. 'ఓజీ' సినిమా ప్రపంచవ్యాప్తంగా సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో అమెరికాలోని ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థ ప్రత్యంగిరా సినిమాస్ ప్రకటించిన వివరాల ప్రకారం, ఆగస్టు 29 నుండి అక్కడ అడ్వాన్స్ బుకింగ్స్ ప్రారంభం కానున్నాయి. ఇక సెప్టెంబర్ 24న ప్రీమియర్ షోలు జరుగనున్నాయి. దీంతో సినిమా విడుదలపై ఎటువంటి జాప్యం లేదని స్పష్టమవుతోంది. అమెరికాలో మాత్రమే కాదు, ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోనూ ఈ సినిమాకు భారీ స్థాయిలో బజ్ కనిపిస్తోంది. హరిహర వీరమల్లు ఫలితం ఎలా ఉన్నా, పవన్ కళ్యాణ్‌కి ఉన్న క్రేజ్‌తో పాటు 'ఓజీ' ట్రైలర్లు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి.సినిమాకు సంగీత దర్శకుడు తమన్ అందించిన ట్యూన్స్ ఇప్పటికే అందరినీ ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా 'నెత్తురుకు మరిగిన హంగ్రీ చీతా' పాటతో మొదలైన హైప్, ఇటీవల విడుదలైన 'ఫైర్ స్ట్రోమ్' పాటతో మరింత పెరిగింది. దర్శకుడు సుజీత్ స్టైలిష్ టేకింగ్, పవన్ పవర్‌ఫుల్ లుక్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేశాయి. గ్యాంగ్‌స్టర్ షేడ్స్ ఉన్న పాత్రలతో పవన్ ఎప్పుడూ హిట్ అందుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు 'ఓజీ'లో ఓజస్ అనే పాత్రలో పవన్ మరోసారి యాక్షన్ మోడ్‌లో కనిపించనున్నాడు. ఇప్పటివరకు విడుదలైన ప్రచార చిత్రాలే అభిమానుల్ని ఫుల్ ఎగ్జైట్ చేశాయి. ఈ సినిమాను డివివి ఎంటర్టైన్మెంట్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత డీవీవీ దానయ్య, ఆయన కుమారుడు దాసరి కళ్యాణ్ కలిసి నిర్మిస్తున్నారు. హీరోయిన్‌గా ప్రియాంక మోహన్ నటిస్తుండగా, ప్రకాశ్ రాజ్, శ్రీయా రెడ్డి వంటి కీలక నటులు ఇందులో కీలక పాత్రలు పోషిస్తున్నారు. సెప్టెంబర్ 25న 'ఓజీ' థియేటర్లలోకి రాబోతున్న నేపథ్యంలో, ఫ్యాన్స్ సంబరాలు ఇప్పటి నుంచే మొదలయ్యాయి. రీల్‌లోనే కాదు, రియల్‌లోనూ పవర్ స్టార్ పవర్ చూపించబోతున్నారని అభిమానులు విశ్వాసంతో ఎదురుచూస్తున్నారు.